APTEL/2008/28200

## అభివృద్ధి కోసం ప్రశ్నిస్తే కార్పొరేటర్ బూతు పురాణం

మేడ్చల్ : మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి చెంగిచెర్ల లోని క్రాంతి కాలనీ రోడ్ నెంబర్ 4 లో కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. డ్రైనేజీ, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, స్థానిక కార్పొరేటర్ బింగి జంగయ్యని అడగగా వల్గర్ గా మాట్లాడంటూ దిగిన కాలనీ ప్రజలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అతి పెద్ద కాలనీన క్రాంతి కాలనీ అభివృద్ధికి నోచుకోక గ్రామాల కంటే అద్వానంగా ఉందని అవేదన వ్యక్తం చేసారు. ప్రతి ఇంటికి కొంత ఎమౌంట్ పోగుచేసి డ్రైనేజీ నిర్మించుకున్నాము. రోడ్ల కోసం కార్పొరేటర్ జంగయ్య ని అడిగితే నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడారని వారు తెలిపారు. మేము సిటీలో ఉన్నామా గ్రామంలో ఉన్నామా అనే విధంగా ఇక్కడి పరిస్థితి ఉందన్నారు.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## రోడ్డు ప్రమాదంలో మిస్టర్ తెలంగాణ మృతి

హైదరాబాద్, జూలై 11 : తెలంగాణలో విషాదం నెలకుంది. మిస్టర్ తెలంగాణ టైటిల్ విజేత, మోడల్, ప్రముఖ బాడీబిల్డర్ మహ్మద్ సోహైల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు విడిచాడు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న స్క్రాప్ ఆటోని ఢీకొంది. సోహైల్ అతని మిత్రుడు మహ్మద్ ఖదీర్‌తో కలిసి జూన్ 29న సిద్దిపేట నుంచి మిరిదొడ్డి వైపునకు వెళ్తుండగా ఈ యాక్సిడెంట్ జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సోహైల్‌ను వెంటనే స్థానికంగా ఉన్న హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన ట్రీట్మెంట్ కోసం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోహైల్ కన్నుమూశాడు. సోహైల్ స్వస్థలం సిద్ధిపేట. తెలంగాణలోని పేరున్న బాడీ బిల్డర్లలో అతడి పేరు ముందు వరసలో ఉండేది. 23 ఏళ్ల వయస్సులోనే బాడీ బిల్డర్‌గా సోహైల్ పలు ఛాంపియన్ షిప్‌లు గెల్చుకున్నాడు.

సంపుటి: 16 సంచిక : 66 కరీంనగర్ శుక్రవారం, జులై 12, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

## 24 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..!



హైదరాబాద్ : ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం మధ్యాహ్నం వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్‌తో పాటు ప్రభుత్వ విప్‌లు రామచంద్ర నాయక్, ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు హాజరయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ ఆర్థికాంశాల గురించి మంత్రి జూపల్లికృష్ణారావు గురువారం సమీక్షించారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ప్రారంభం కాగా, సాయంత్రం వరకు కొనసాగింది. ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కానీ ఎన్ని రోజులు జరుగుతాయనే విషయంపై స్పష్టత రాలేదు. ఈ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అలాగే.. ముఖ్యమైన రైతు భరోసా పథకంపైనా కీలకమైన చర్చ జరిగే అవకాశం ఉన్నది. అసెంబ్లీలో చర్చించిన తర్వాత విధివిధానాలపై నిర్ణయానికి వస్తామని ఇది వరకే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అలాగే, జాబ్ క్యాలెండర్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం సమావేశాల్లో ప్రకటించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

## తెలంగాణ బీజేపీ రథసారథి ఎంపికపై కసరత్తు ?



హైదరాబాద్ జూలై 11 : కిషన్‌రెడ్డి ప్లేస్‌లో ఎవరు..? తెలంగాణ బీజేపీ పగ్గాలు ఎవరికి..? ఈ ప్రశ్నలకు త్వరలోనే సమాధానం దొరకపోతోంది. ఢిల్లీలో రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై కసరత్తు జరుగుతోంది. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ నెలఖరుకే కొత్త సారథికి పగ్గాలు అప్పగించే ఛాన్స్ కనిపిస్తోంది. అందరికంటే ముందు రేసులో ఈటల రాజేందర్ ఉన్నా.. ఆయనకు రఘునందన్, ధర్మపురి అర్వింద్ నుంచి గట్టి పోటీయే ఉంది. కిషన్‌రెడ్డి ప్లేస్‌లో ఎవరు..? తెలంగాణ బీజేపీ పగ్గాలు ఎవరికి..? ఈ ప్రశ్నలకు త్వరలోనే సమాధానం దొరకపోతోంది. ఢిల్లీలో రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై కసరత్తు జరుగుతోంది. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ నెలఖరుకే కొత్త సారథికి పగ్గాలు అప్పగించే ఛాన్స్ కనిపిస్తోంది. అందరికంటే ముందు రేసులో ఈటల రాజేందర్ ఉన్నా.. ఆయనకు రఘునందన్, ధర్మపురి అర్వింద్ నుంచి గట్టి పోటీయే ఉంది. ఈ ముగ్గురిలో ఒకరికి ఛాన్స్ దక్కుతుందని ప్రచారం జరుగుతున్న టైమ్‌లో.. ఎవరికివారు తమ బలాబలాలను హైకమాండ్ ముందు ఉంచుతున్నారు. ఇప్పటికే తెలంగాణలో బీజేపీ తన ఉనికిని క్రమంగా విస్తరిస్తూ వచ్చింది. ఎన్నికలు ఏవైనా కమల వికాసం ఖాయం అనేలా తన కేడర్ ను బలపరుచుకుంది. ఈ క్రమంలోనే రాష్ట్రానికి ఒక బలమైన దిశానిర్దేశం చేసే నాయకుడు ఉండాలని భావిస్తోంది. అయితే కొత్త జాతీయ అధ్యక్షుడి నియామకం ఆలస్యమవుతుండడంతో.. పలు రాష్ట్రాల్లో అధ్యక్షుల మార్పుపై హైకమాండ్ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. హర్యానా ఎన్నికల నేపథ్యంలో ముందుగా అక్కడ బీజేపీ చీఫ్‌ను ప్రకటించారు. ఆ రాష్ట్ర అధ్యక్షుడిగా మోహన్‌లాల్ బడోలీకి బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే తెలంగాణ సహా మరికొన్ని రాష్ట్రాల్లోనూ అధ్యక్ష మార్పులు ఉంటాయని తెలుస్తోంది. కిషన్‌రెడ్డి కేంద్ర కేబినెట్‌లో ఉన్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా అధ్యక్ష బాధ్యతల్ని మరొకరికి అప్పగించేలా కసరత్తు జరుగుతోంది. గతంలో బండి సంజయ్ కు ఇచ్చిన తరుణంలో తిరిగి ఆయనకే అధ్యక్షుడి పగ్గాలు అప్పగిస్తారన్న చర్చ ఓ వర్గంలో జరుగుతోంది. అయితే ఆయనకు కూడా రాష్ట్ర అధ్యక్షునిగా పదవి దక్కే అవకాశాలు కనపించడం లేదు. దీనికి కారణం ఆయనను కూడా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి పదవి వరించడమే. దీంతో ఇక మిగిలింది ఈటల, ధర్మపురి అర్వింద్, రఘునందన్. ఈ ముగ్గురిలో ఈటలకు అవకాశాలు అధికంగా ఉండటానికి కారణం రాష్ట్రంలో సీనియర్ నేత, బీఆర్ఎస్ లో ఉండి అక్కడి పరిస్థితులు కేసీఆర్ వ్యూహాలు బాగా తెలిసిన వ్యక్తి కావడంతో ఆయనకే రాష్ట్ర అధ్యక్షుడి పదవి దక్కుతుందని ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు. ఏది ఏమైనా మరో 20 రోజుల్లో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కొత్త రథసారథి ఎవరనే ఉత్కంఠకు తెరతొలగనుంది.

## సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ తీసుకురండి

### బండి సంజయ్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్ : ఈసారి కేంద్ర బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకురావాలని కోరుతూ కేంద్రమంత్రి బండి సంజజ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. పదేళ్లుగా ప్రతి బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు మొండి చెయ్యి చూపిందని గుర్తు చేశారు. అనేకసార్లు పవర్‌లూమ్ క్లస్టర్ కోసం పది సార్లు కేంద్రానికి లేఖలు, స్వయంగా కలిసి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు కేటీఆర్. ఈ సారైనా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తెప్పించండి. కేంద్ర మంత్రిగా మీకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోండి. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో సిరిసిల్లకు శుభవార్త అందేలా చూడాలని బండి సంజయ్‌ను కేటీఆర్ కోరారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కోరారు. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ప్రధాని మోదీని ఒప్పించి సిరిసిల్లా మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది, మీరు ఈ ప్రాంత ఎంపీగా ఐదేళ్ల క్రితం ఎన్నికయ్యారు కానీ నేతన్నలకు ప్రతిసారి నిరాశానే ఎదురైందన్నారు. గతంలో పదేళ్లుగా సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చేందుకు తాను ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదన్నారు. సుమారు పదిసార్లు కేంద్రంలో స్మృతి ఇరానీ, అరుణ్ జైట్లీ వంటి అనేక మంది మంత్రులను నేను స్వయంగా కలిసినా దక్కింది శూన్యం అన్నారు. బండి సంజయ్‌ను కూడా ఎన్నోసార్లు ఈ అంశంలో సహకారం అందించాలని కోరినప్పటికీ మీరు పట్టించుకోలేదన్నారు. అయితే రెండోసారి మీరు ఎంపీ కావటం, కేంద్రంలో కూడా మంత్రిగా పదవి దక్కటంతో సిరిసిల్ల నేతన్నలకు సేవ చేసేందుకు మీకిది సరైన సమయం అని గుర్తించండి అని తెలిపారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ఈ బడ్జెట్‌లో సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ కస్టర్‌ను ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని, ఉపాధి లేక ఇక్కడి కార్మికులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సంగతి మీరు గుర్తించండన్నారు.

## బురద చల్లడం ఆపి.. ఓటమిని సమీక్షించుకోండి



హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు తమపై బురద చల్లడం ఆపి ఓటమిని సమీక్షించుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. అధికారం కోల్పోయి ఏడు నెలలైనా బీఆర్ఎస్ పెద్దలు ఇప్పటికీ భ్రమాలోకం నుంచి బయటకు రాలేకపోతున్నారని విమర్శించారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల భంగపాటు తర్వాత లోపం ఎక్కడుందో సమీక్షించుకోవాల్సింది పోయి ప్రభుత్వంపై బురద చల్లడంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. ఈరోజు(గురువారం) గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపితే స్వాగతిస్తాంమని తెలిపారు. నిస్పృహతో కూడిన ప్రకటనలతో గందరగోళాన్ని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రజయోజనం ఉండదని చెప్పారు. రాజకీయ పార్టీల గెలుపు ఓటములను ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. వారి అభిమానం ఉన్నంతకాలమే ఏ రాజకీయ పక్షమైనా కొనసాగుతుందని తెలిపారు. ఇంత జరిగినా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరులో ఏమాత్రం మార్పు రాలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు సచివాలయానికి రాకుండా నివాసం నుంచే పాలన సాగించారని ధ్వజమెత్తారు. కనీసం ప్రతిపక్ష నేతగానైనా ఆయన జనం మధ్యకు వెళ్తారనుకున్నామని కాని ఇంట్లోనే కూర్చుని కార్యకర్తలను తనవద్దకు రప్పించుకుంటున్నారని దెప్పిపొడిచారు. కాంగ్రెస్ పార్టీ యాదృచ్ఛికంగా అధికారంలోకి వచ్చిందని ఇప్పటికీ ప్రచారం చేస్తుండటం వాళ్ల ఆలోచనలో ఏమాత్రం మార్పు రాలేదని తెలిసిపోతోందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు గెల్చుకుందని... బీఆర్ఎస్‌కు దక్కింది 39 మాత్రమే. 25 సీట్ల ఆధిక్యతను మర్చిపోతున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 2019 లో 9 స్థానాలు గెల్చిన ఆ పార్టీ సున్నాకే పరిమితమైందని సెటైర్లు గుప్పించారు. ఇది ప్రజలిచ్చిన తీర్పు కాదా? అయినా ఓటమితో దిష్టి తొలగిందని సమర్థించుకోవడం ఏంటి? అని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వచ్చి 15 ఏళ్లు అధికారంలో ఉంటామని గాంభీర్యాలకు పోవడం కలలో జీవించడం కాదా అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పార్టీ ప్రజలకు ఏలోటూ రాకుండా చూసుకుని మళ్లీ మళ్లీ గెలుస్తాం అనడంలో హేతుబద్దత ఉందని తెలిపారు. నేలమట్టమైన పార్టీని నాలుగున్నరేళ్ల తర్వాత అధికారంలోకి తీసుకొచ్చి 15 ఏళ్లు నిరాటంకంగా పరిపాలిస్తామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ది తార్కికతకు దగ్గరగా లేని అందమైన ఊహ అనుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు.

## నీట్ వివాదంపై జులై 18కి వాయిదా



ఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు గురువారం సుదీర్ఘంగా విచారించింది. అనంతరం తదుపరి విచారణను జులై 18కి వాయిదా వేసింది. మొదట దీనిపై శుక్రవారమే విచారణ చేపడతామని చెప్పినప్పటికీ.. సొలిసిటర్ జనరల్ అభ్యర్థన మేరకు ఇవాళే విచారణ చేపట్టి వాయిదాను పొడగించింది. ఈ వ్యవహారంపై ఎన్టీఏ, కేంద్రం ఇప్పటికే తమ స్పందనలు తెలియజేశాయని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. పిటిషనర్ల తరఫున వాదిస్తున్న న్యాయవాదులు.. కేంద్రం, ఎన్టీయే సమర్పించిన అఫిడవిట్‌లను ఇంకా అందుకోలేదని న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం గమనించింది. వాటిని పరిశీలించేందుకు వీలుగా విచారణను జులై 18కి వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ చెప్పారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని కచ్చితమైన ఆధారాలు లేవని కోర్టుకు తెలిపింది. కొన్ని సెంటర్లలో మాత్రమే పరీక్ష పేపర్ లీక్ జరిగినట్లు వెల్లడించింది. లీకైన నీట్ పేపర్ బిహార్‌లోని ఒక్క పరీక్ష కేంద్రానికే పరిమితమైందని.. దేశమంతటా కాదని సీబీఐ కూడా సుప్రీం కోర్టుకు తెలిపింది. సోషల్ మీడియాలో కూడా ఇది వ్యాప్తి చెందలేదని చెబుతూ.. ఇందుకు సంబంధించిన వివరాలను సీల్డ్ కవర్‌లో కోర్టుకు అందజేసింది. భద్రతను వివరించడానికి ప్రశ్నపత్రం ముద్రణ, రవాణా, పంపిణీకి సంబంధించిన ప్రోటోకాల్‌లను కూడా వివరించింది. అయితే పేపర్ లీకేజీపై కోర్టు మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. కొందరు చేసిన తప్పుతో లక్షల మంది జీవితాలు ప్రభావిమయ్యాయని పేర్కొంది. పరీక్షను మళ్లీ జరిపేందుకు లీకేజీ పరిధి ఎక్కడి వరకుందో తెలుసుకోవాలని సూచించింది. సంబంధిత పత్రాలను సమర్పించాలని ఎన్టీయే, కేంద్రం, సీబీఐలను ఆదేశించింది.

## సుప్రీంకోర్టులో మల్టీ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన సీజేఐ



సుప్రీంకోర్టులో మల్టీ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సహా పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణంతో ప్రజలకు సులభంగా న్యాయం జరుగుతుందన్నారు. మల్టీ పర్పస్ సెంటర్ 'యాక్సెస్ టూ జస్టిస్ ఫర్ ఆల్' క్యాంపెయిన్‌లో భాగమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆవరణలోని యూకో బ్యాంక్ ఎదురుగా ఉన్న సీ-ఇన్ గేటు సమీపంలో ఈ భవనాన్ని నిర్మించారు. ఫెసిలిటీ సెంటర్ నిర్మాణం వెనుక ప్రధాన ఉద్దేశం ఏంటంటే.. ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులందరూ ఒకే చోట కేసులు నమోదు చేయడానికి, కేసులకు సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు వీలుగా నిర్మించారు. దాంతో సేవల్లో నాణ్యత పెరుగనున్నది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సీజేఐపై ప్రశంసలు కురిపించారు. ఆయన ఎప్పుడూ హడావుడిగా ఉంటారని తాను చెప్పగలనని.. ఆయన దేశంలోని న్యాయవాదులకు, కక్షిదారులకు ఏదో ఒకటి చేయాలనుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన వేగం, భవిష్యత్ గురించి ఆలోచనలను చూసి తాము ఆశ్చర్యపోయామని.. ఈ దేశ న్యాయ వ్యవస్థపై ఆయనకున్న నిబద్ధతకు ఈ ఫెసిలిటీ సెంటర్ ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు.

## ఉచిత రేషన్ పథకం నిరంతరం కొనసాగుతుంది

### స్పష్టం చేసిన కేంద్ర మంత్రి పహ్లాద్ జోషి



కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన నిరంతరం కొనసాగుతుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ద్వారా ప్రతి ఇంటికి 5 కిలో ధాన్యం ఉచితంగా అందిస్తున్నా మన్నారు. దేశవ్యాప్తంగా 80 కోట్ల మంది ప్రజలకు లబ్ది చేకూరుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద రేషన్ కార్డ్ హోల్డర్‌కు 5 కిలోల ఉచిత రేషన్ కేటాయింపును వచ్చే ఐదేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. ఏప్రిల్ 2020లో ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం కారణంగా, కేంద్ర ప్రభుత్వం %ూవీ+ఖాా%ని ప్రతి రేషన్ కార్డ్ హోల్డర్‌కు అదనంగా 5 కిలోల ఆహార ధాన్యాలను సబ్సిడీ ధరలకు అందించింది. రేషన్ కార్డ్ హోల్డర్లకు 5 కిలోల ఆహార ధాన్యాలను అందించాలని మోదీ సర్కార్ నిర్ణయించింది. ఏప్రిల్ 2020 నుండి రేషన్ కార్డ్ హోల్డర్‌లు ఒక్కొక్కరికి 10 కిలోల రేషన్ అందిస్తూ వస్తోంది. %చీఖీూా% కింద సబ్సిడీ ధరపై 5 కిలోలు, %ూవీ+ఖాా% కింద 5 కిలోలు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇక ఆ తర్వాత 2022 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నగా మార్చింది. ఈ పథకం కింద ప్రతి రేషన్ కార్డ్ హోల్డర్‌కు 5 కిలోల రేషన్ ఉచితంగా అందిస్తోంది. కాగా, మోదీ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం కారణంగా దేశవ్యాప్తంగా 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడగలిగారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు.

# తెలంగాణ నుండి ఫోకస్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, జులై 12, 2024


# మళ్లీ మంచిరోజులు!

## యుద్ధప్రాతిపదికన చెరువుల పునరుద్ధరణ

## రూ. 25 కోట్లతో ముమ్మరంగా పనులు



భూపాలపల్లి, జులై 11: గత ఏడాది సంభవించిన ప్రకృతి వైపరీత్యాన్ని తలచుకుంటే.. ఇప్పటికీ వెన్నులో వణుకు వస్తోంది. జూలై 27 రాత్రిని మరచిపోలేం. కుంభవృష్టి వర్షం భూపాలపల్లి జిల్లాను అతలాకు తలం చేసింది. వాగులు వంకలు పొంగిపోర్లాయి.. చెరువులు దెబ్బతిన్నాయి. జలదిగ్బంధనంలో జనం చిక్కుకొని విలవిలలాడారు. ఊర్లను వరద ముంచెత్తింది. ఇల్లు చెదిరి అనేక మంది నిరాశ్రయులయ్యారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు. పొలాల్లోకి నీరు చేరి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో భూపాలపల్లి నియోజకవర్గంలోని చెరువులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏడు మండలాల పరిధిలో మొత్తం 162 చెరువులు ధ్వంసమయ్యాయి. మరింత నష్టం వాటిల్లకుండా వీటిలో కొన్నిటిని రైతుల సాయంతో నీటిపారుదల శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. మిగిలిన 124 చెరువుల్లో కొన్నిటి కట్టలు పూర్తిగా కొట్టుకుపోయాయి. మరికొన్నిటి మత్తడులు, తూములు ధ్వంసమయ్యాయి. ఎక్కువ శాతం చెరువులు కట్టలు కోట్టుకుపోవడంతోపాటు పొలాలకు సాగు నీరందించే కాల్వలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. భూపాలపల్లి మండలంలో కొత్తపల్లి(ఎస్ఎం), రేగొండ మండలంలోని చిన్నకోడేపాక తది తర పెద్ద చెరువులు వరద ఉధృతితో పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వానలకు దెబ్బతిన్న చెరువుల్లో కొన్నిటిని అధికారులు అప్పటికప్పుడు పునరుద్ధరించి సాగునీరు అందించారు. మిగి లిన 124 చెరువులు మాత్రం పూర్తిగా ధ్వంసం కావడంతో రైతులు గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేయలేదు. సాగునీరు అందక సుమారు 10వేల ఎకరాలు పూర్తిగా బీడువారిపోయాయి. భూపాలపల్లి నియోజకవర్గంలో పూర్తిగా దెబ్బతిన్న 124 చెరువుల పునరుద?రణ పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. రూ. 25 కోట్ల ప్రత్యేక నిధులతో ఆయకట్టుకు ఖరీఫ్ పంటకు నీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. దెబ్బతిన్న చెరువుల కట్టలు, మత్తళ్లు, తూములను పునరుద్ధరిస్తున్నారు. 75 శాతం చెరువులకు సం బంధించిన పనులను ఇప్పటికే పూర్తి చేసిన అధికారులు కాల్వల పునరు ద్ధరణపై దృష్టి సారించారు. రైతులు పంటలు వేసుకునే సమయం సమీపి స్తుండటంతో పనుల్లో వేగం పెంచారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు దెబ్బతినడంలో అధికా రుల అలసత్వం ఉన్నట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. చేపలు కొట్టుకుపోకుండా మత్తళ్లకు స్థానిక మత్సకారులు ఏర్పాటుచేసుకున్న పనులే చెరువులు కొట్టుకుపోవడానికి కారణమని నిర్ధారించిన నీటిపారుదల అధికారులు అప్పటి ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చుకున్నారు. వరదల వల్ల చెరువు మత్తడి గుండా చేపలు కొట్టుకుపోకుండా మత్సకారులు ఇసుప జాలీలను కట్టారు. చెరువులోకి వచ్చే వరద నీరు బయటకు వెళ్లే క్రమంలో మత్తళ్ల వద్ద అక్రమంగా ఏర్పాటుచేసిన ఇనుప జాలీలకు వరదల్లో వచ్చే చెత్తాచెదారం పేరుకుపోయి అడ్డుకట్టగా ఏర్పడి కట్టలపై ఒత్తిడి ఏర్పడిందని తెలుస్తోంది. దీంతో కట్టలు కొట్టుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. భూపాలపల్లి మండలం కొత్తపల్లి(ఎస్ఎం) శివారు దొమ్మటిపల్లి చెరువు, రేగొండ మండలం చిన్నకోడేపాక చెరువులు ఈ కారణంతోనే తెలిపోయాయి. మరిన్ని చెరువులు కూడా ఇలానే ధ్వంసమయ్యాయి.

## నేడు తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవం



హైదరాబాద్ : అలనాటి అపర భగీరథుడు నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్.. తెలంగాణ గర్వించ దగిన విలక్షణమైన ఇంజనీర్. ఆయన జయంతిని ప్రతి ఏడాది తెలంగాణ ఇంజినీర్స్ డేగా నిర్వహించుకుంటున్న సంగతి తెలిసిందే. నవాజ్ జంగ్ బహదూర్ 147వ జయంతి సందర్భంగా.. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ ఘననివాళులర్పించింది. ఇక బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది తెలంగాణ ఇంజినీర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేవారు. జలసౌధలో నవాజ్ జంగ్ బహదూర్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేవారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణ ఇంజినీర్స్ డేను నిర్వహించడం మరిచిపోయినట్లుంది. తెలంగాణలో ఎన్నో ప్రాజెక్టుల రూపకర్త అయిన నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం స్మరించుకోకపోవడం శోచనీయం. నదులను ఒడిసి పట్టి సాగు, తాగునీటి వనరులను భవిష్యత్ తరాలకు అందించిన గొప్ప దార్శనికుడు. నైజాం కాలంలో ఆయన నీటి వనరుల నిపుణుడిగా ప్రఖ్యాతిగాంచాడు. వలస పాలనలో ఆయన చరిత మరుగున పడిపోయినప్పటికీ స్వరాష్ట్రం వచ్చిన తర్వాత సర్కార్ ఆయన సేవలను వెలుగులోకి తెచ్చింది. నాటి సీఎం కేసీఆర్ ఆయన చేసిన కృషికి గాను ఏటా జూలై 11న నవాబ్ అలీ నవాబ్ జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా 'రాష్ట్ర ఇంజినీర్స్ డే' నిర్వహించాలని నిర్ణయించారు. 2014 నుంచి ఏటా ఇదే తేదీన వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇంజినీర్స్, సాంకేతిక నిపుణులు ఆయన సేవలను ప్రజలకు చాటి చెప్తున్నారు. నవాబ్ జంగ్ ఆయన దార్శనికతతో మన జిల్లాకు 'జల వరాలు' అందించారు.

## ఆయుధమా... దరిద్రమా

సరిగ్గా ఉపయోగిస్తే సోషల్ మీడియాను మించిన ఆయుధం లేదు. కానీ తప్పుగా ఉపయోగిస్తే దానంత దరిద్రమూ ఇంకొకటి లేదు. నిజానికి ప్రస్తుతం సోషల్ మీడియా ఎంత దారుణంగా ఉంటుందో రోజూ చూస్తూనే ఉన్నాం. నచ్చని వాళ్లపై ద్వేషాన్ని స్ప్రెడ్ చేయడం, నెగెటివిటీ పెంచడం. లేడీస్‌పై ఇష్టమొచ్చినట్లుగా పోస్టులు చేయడం, సెలబ్రెటీలను బూతులు తిట్టడం. ఇలా సోషల్ మీడియాలో జరిగే అకృత్యాలకి అడ్డు అదుపే లేకుండా పోయింది. కనీసం చిన్న పిల్లలు అనే ఇంగితం కూడా లేకుండా వారిపై కూడా సోషల్ మీడియాలో డబుల్ మీనింగ్ ట్రోల్స్, మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు కొంతమంది దరిద్రులు. ఎవరు ఎటు పోతే ఏంటి.. అతనికి వ్యూస్ కావాలి. అతని పర్వర్షన్ హైలైట్ కావాలి. అందుకు ఏమైనా చేస్తారు.. ఎంతకైనా తెగిస్తారు. సభ్య సమాజంతో పని లేదు.. తమ మైండ్‌లో ఉన్న చెత్తనంతా సోషల్‌మీడియాలోకి డంప్ చేస్తారు. పగలబడి నవ్వుకుంటారు. అందుకు తండ్రీకూతుళ్ల పవిత్ర బంధాన్ని కూడా వాడుకుంటారు. సోషల్ మీడియా ఎంత వికృతంగా తయారైందో.. ఇన్ఫ్లూయెన్సర్ల ముసుగులో ఎలాంటి నరరూప రాక్షసులు ఉన్నారో మరోసారి తెరపైకి వచ్చింది. ప్రణీత్ హనుమంతు వీడియో చాటింగ్. అందులో అతని తూతుంబర్ బ్యాచ్ చేసిన కామెంట్స్. వీళ్ల వల్గర్ కామెంట్స్ ఎంత దిగజారాయో. వాళ్ల సంభాషణ చూసినవాళ్ల మైండ్ ఎలా మారిపోతుంది. ఇప్పుడు సోషల్ మీడియా మైనర్ల చేతిలోకి కూడా వచ్చేసింది. వాళ్లపై ఎలాంటి ఎఫెక్ట్ చూపిస్తుందో స్పెషల్ గా చెప్పాల్సిన పనిలేదు. ఈ వీడియోలో తండ్రీకూతుళ్ల గురించి అసభ్యంగా మాట్లాడిన ప్రణీత్ హనుమంతు బ్యాచ్.. తమ పిల్లల విషయంలోను అలాగే బిహేవ్ చేస్తారా? ఇలాగే.. వికృతానందం పొందుతారా ? చిన్నపిల్లలపై వీళ్ల పైశాచిక కామెంట్స్ పై సోషల్ మీడియాలో పెద్ద దుమారమే రేగింది. యాక్టర్ సాయి ధరమ్ తేజ్ ట్వీట్ తో మొత్తం ఇండస్ట్రీ దీనిపై డిబేట్ చేసింది. దీంతో సీఎం రేవంత్ దీనిపై సీరియస్ అయ్యారు.. వెంటనే నిందితులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అమెరికా పారిపోతుండగా ప్రణీత్‌ను బెంగుళూరులో అరెస్ట్ చేశారు హైదరాబాద్ పోలీసులు. త్వరలోనే అతడ్ని హైదరాబాద్ తీసుకువస్తారని సమాచారం. ఇప్పటికే ప్రణీత్‌పై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. చాలా కాలంగా కామెడీ పేరుతో డబుల్ మీనింగ్ డైలాగులు, బూతులతో యూట్యాబ్ సహా సోషల్ మీడియాలో ప్రణీత్ వీడియోలు పోస్ట్ చేస్తున్నాడు. నలుగురు ఐదుగురు ఫ్రెండ్స్‌తో కలిసి ఏదో ఒక టాపిక్ మీద చర్చ పెడుతూ అసభ్యకరమైన కామెంట్లు చేస్తున్నాడు. ఇలానే తాజాగా ఓ తండ్రీకూతుళ్ల వీడియోపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ ప్రణీత్ రెచ్చిపోయాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మొదటిగా హీరో సాయి ధరమ్ తేజ్ దీనిపై ఇండైరెక్ట్‌గా స్పందించారు. సోషల్ మీడియాలో మృగాలు ఎక్కువైపోయాయి.. తల్లిదండ్రులు దయచేసి మీ పిల్లల ఫొటోలు, వీడియోలు ఇందులో పెట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండండి అంటూ సాయి తేజ్ ఓ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ తర్వాత టాలీవుడ్ యంగ్ హీరోలు మంచు మనోజ్, విశ్వక్ సేన్, అడివి శేష్, కార్తికేయ, సుధీర్ బాబు సహా పలువురు ప్రణీత్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను కోరారు. సెలబ్రెటీలు వరుసగా పోస్టులు పెట్టడంతో ప్రభుత్వాలు కూడా వెంటనే స్పందించాయి. సదరు యూట్యూబర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాయి. ఇచ్చిన మాట ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ప్రణీత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే తాను చేసింది తప్పేనని.. అనుకోకుండా అలా వీడియో చేశానంటూ ప్రణీత్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశాడు. దయచేసి తన తల్లిదండ్రులను ఇందులోకి లాగొద్దంటూ రిక్వెస్ట్ చేశాడు. ఈ మేరకు క్షమాపణలు చెబుతూ కూడా ఓ వీడియోను పోస్ట్ చేశాడు. కానీ నువ్వు చేసింది చిన్న తప్పు కాదు పెద్ద క్రైమ్ అంటూ నెటిజన్లు ప్రణీత్ వెంటపడి మొత్తానికి అరెస్ట్ చేయించే వరకూ సోషల్ మీడియాలో పెద్ద ఉద్యమమే చేశారు. మరి అరెస్ట్ ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుందా..? కానే కాదు.. ఎందుకంటే దొరికింది ఒక్కరే. ఇలాంటి బ్యాచ్ కుప్పలు తెప్పలుగా ఉన్నారు. వీరు చేసే అరాచకాలకు అనేక మంది ఇన్ఫ్లూయెన్స్ అవుతున్నారు. ఈ పరాకాష్టకు తోడు చిన్న పిల్లలపై అఘాయిత్యాలు. చిన్న పిల్లల్ని బయటకు పంపించాలంటే వణికిపోతున్నారు పేరెంట్స్. అయినా చిన్న పిల్లలపై వర్గర్ లాంగ్వేజ్ ఏంటీ బుద్ధి లేకపోతే సరి. చిన్న పిల్లలపైనే కాదు.. సోషల్ మీడియాలో ఏది పెట్టిన ఇప్పుడు వైరలే అవుతోంది. పెరుగుతున్న టెక్నాలజీతో ప్రపంచంలో ఎక్కడేం జరిగినా క్షణాల్లో తెలుస్తోంది. దీనికి తోడు టాపిక్ ఏదైనా.. మన ఓపినియన్‌ను ఎంచక్కా చెప్పుకునే ఫ్రీడమ్ ఉంది. ట్రెండ్‌కు తగ్గట్టు మారడం.. సోషల్ మీడియాను ఉపయోగించుకోవడం పెద్ద తప్పేమీ కాదు. కానీ ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనో.. ఏం అన్నా తమనేం చేయలేరన్న ధీమా వచ్చేస్తుందో అప్పుడు అన్నీ అదుపు తప్పుతాయి. కామెంట్లు కంట్రోల్ తప్పుతాయి. లేటెస్ట్ గా జరిగింది కూడా అదే. ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? ఎందుకు ఇంతలా దిగజారి మాట్లాడుతున్నారు? వాట్సాప్ , ట్విట్టర్ , ఫేస్బుక్ , యూట్యూబ్ ఇలా ప్లాట్‌ఫామ్ ఏదైనా సరే. అన్నింటినీ నెగిటివ్ కోణంలోనే చూస్తున్నారు. ఏదైనా పోస్టు పెడితే దానికి బాధ్యతాయుతంగా కామెంట్ చేసేవారు ఎంతమంది? అయితే బూతుపురాణం.. లేదంటే క్యారెక్టర్ అసోసియేషన్. అదీ కాకపోతే అంతకుమించిన అలిగేషన్స్ చేయడం. అంతేకాని ఆ పోస్టు దేని గురించి..? అది నిజమేనా? కాదా? అని ఫ్యాక్ట్ చేసుకునేది లేదు. చేతిలో ఫోన్ ఉంది కదా అని.. రెచ్చిపోవడం మాత్రమే జరుగుతోంది. పచ్చి బూతులతో నిండిపోతున్న పోస్టులను చూస్తే అసలు వారు చదువుకున్న వారేనా అన్న డౌట్ రాక మానదు. ఎందుకంటే సోషల్ మీడియా ఉపయోగిస్తున్నారంటేనే కాస్తో కూస్తో చదువుకున్నవారై ఉంటారు. మరి వారికి ఆ చదువు నేర్పిన సంస్కారం ఇదేనా ? ఎదురుగా లేరు కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే నొచ్చుకునే మనసులు ఉంటాయి. మొన్నటికి మొన్న ఓ తల్లి పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించిందని ట్రోల్ చేశారు. ఆ ట్రోల్స్ భరించలేక ఆ తల్లి చనిపోయింది. అంతకు ముందు గీతాంజలి అనే మహిళ. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక మంది ట్రోల్స్‌కి బలవుతున్న వారే. అసలు బూతులు తిట్టే హక్కు ఎవరిచ్చారు ? ఇలాంటి బూతు, రోత కామెంట్లు పెట్టే హక్కు ఎవరిచ్చారు ? ఒక్కసారి ఆలోచించండి. బాధ్యతగా మెలగండి. అన్నింటికంటే ముందు మనం మనుషులమని గుర్తించండి. ఎదుటి వారికి కనీస గౌరవం ఇవ్వాలన్న ఇంగిత జ్ఞానాన్ని మరవకండి. దయచేసి ఇకనైనా మారండి.. సోషల్‌మీడియాలో కాస్త సంస్కారం చూపించండి.

# రాహుల్ అన్నట్టు రామాలయ ఉద్యమం ఓడిందా?



సొంత ప్రతాపం కొంత ఉంటే, జబ్బలు ఎంత చరుచుకున్నా ఒక అందం. అరువు బలం మీద ఆధారపడి, అంతా తమ ప్రతాపం అంటేనే వికారం. మొదటికే మోసం వచ్చినా, మూడోసారి మహాప్రసాదమని మురిసిపోతున్న ప్రధాని మోదీ గురించి కాదు. ఉట్టిని మాత్రమే కొట్టి, స్వర్గం దక్కిందని సంబరపడుతున్న 'బాలక్' రాహుల్ గురించి. పొత్తు ఉంటే ఉండొచ్చు కానీ, అయోధ్యలో గెలిచింది తను కాదు, తన పార్టీ కాదు. అయినా, ఆడ్వాణీ ఆరంభించిన రామాలయ ఉద్యమాన్ని తాము అయోధ్యలో ఓడించామని రాహుల్ గాంధీ చెబుతున్నారు. అదే మాదిరిగా, ఇంకో మూడేళ్లలో గుజరాత్‌లో కూడా బీజేపీని ఓడిస్తామని సవాల్ చేస్తున్నారు. ఉద్యమ స్థలంలో గెలిచినట్టే, మోదీ స్వరాష్ట్రంలోనూ గెలుస్తామని ఆయన ఉద్దేశం కావచ్చు. గుజరాత్‌లో ఆ కర్తవ్యం నెరవేర్చే మిత్రపక్షమేదో? అయోధ్యలో సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి అవధేశ్ సింగ్ పాసీ విజయం నిస్సందేహంగా ఒక విశేషమే. ఉధృతంగా ఉన్న భావావేశాన్ని కాదని, నిత్యజీవన సమస్యలు పైచేయి అయిన ఎన్నిక అది. ఒక వైచిత్రి, జనరల్ సీటులో ఒక దళిత అభ్యర్థి, సవర్ణ ప్రత్యర్థులను ఓడించి గెలవడంలో ఒక కవితాన్యాయం కూడా ఉండవచ్చు. కానీ, అయోధ్య అన్నది రామాలయ ఉద్యమంలో కీలకమయిన స్థలం, గమ్యం తప్ప, అదే సర్వస్వం కాదు. రామజన్మభూమి ఉద్యమం అన్నది ఒక ప్రయాణం. సుమారు నాలుగుదశాబ్దాల ప్రయాణం. దాదాపు దేశమంతటా, ఆ ప్రయాణం సాగింది. దాని ప్రభావాలు, పర్యవసానాలు దేశమంతటికీ వ్యాపించి ఉన్నాయి. అయోధ్యలో బీజేపీ ఓడిపోయినంత మాత్రాన, ఆ ఉద్యమం ఓడినట్టు కాదు. ఆ ఉద్యమ ప్రభావం రాజకీయరంగంలో ఇంతకు మునుపులా ఉండకపోవచ్చు. క్షీణించవచ్చు. లేదా, అది సాధించదలచుకున్న ఫలితాలు సాధించుకున్నది కనుక, అందులో నుంచి రాగలిగిన ఫలసాయం అందింది కనుక, ఇకపై అది ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోవచ్చు. భావావేశాలు ఉపశమించవచ్చును కానీ, భావాలు మిగిలే ఉంటాయి, లోలోపలికి ఇంకి ఉంటాయి. సమాజం ఆలోచనల్లో, ఎంపికల్లో, వ్యవహారసరళిలో అవి పనిచేస్తూనే ఉంటాయి. రేపు, మధుర, కాశీ స్థలాల్లో అదే రకమైన ప్రయత్నాలు మొదలయితే, అయోధ్య జ్ఞాపకం కూడా దానికి ప్రేరణ అవుతుంది. ఒకనాటి ఘనభారతం మధ్యయుగాలలో విదేశీయుల, ముఖ్యంగా ముస్లిముల, ఆక్రమణలకు లోనై భంగపడిందని, ఆ కుంగుబాటు నుంచి హిందువులను ఆత్మవిశ్వాసంలోకి ఉద్ధరించాలని, స్వాతంత్ర్యానంతరం పాలించిన ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు విమత, విజాతి శ్రేణులను బుజ్జగిస్తూ వచ్చాయని, మతజాతీయత నిర్మాణం ద్వారా ధర్మాన్ని, దేశాన్ని పటిష్ఠం చేయాలని విశ్వసించే ఆలోచనల, ఆచరణలలో భాగమే రామమందిర ఉద్యమం. బాబ్రీమసీదు విధ్వంసం కానీ, ఆ స్థలంలో నిర్మితమైన నూతన రామాలయం కానీ గాయపడిన జాతిగౌరవానికి జరిగిన ప్రతిన్యాయంగా ఆ ఉద్యమ శ్రేణులు భావిస్తాయి. బాబర్ ద్వారా ఒకనాటి రామజన్మభూమి ఆలయం ధ్వంసమైందన్న వివాదం చరిత్రకు, పురాతత్వ శాస్త్రానికి సంబంధించినది. కాగా, ఆధునిక కాలంలో వలస ఆలోచనావిధానం, సామ్యవాదులు, ఉదారవాదుల వల్ల భారతీయ భావధార, సంస్కృతి అణగారిపోతున్నాయని, విమతస్థుల నుంచి మెజారిటీ మతస్థులకు ప్రమాదం పొంచి ఉన్నదని తీవ్ర జాతీయవాదం అనుకుంటుంది. ఈ చారిత్రక, సమకాలిక కథనాలు సమన్వయంతో సాగి, ఆ ఆలోచనలకు విస్తృతమైన మద్దతు కూడగట్టాయి. ఇంకా అనేక ఇతర అనుబంధకారణాలు కూడా పనిచేసి, 1984లో రెండు లోక్‌సభ స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీజేపీని, 2014లో 282 స్థానాల విజయానికి చేర్చింది. ఇప్పుడు ఈ స్థానాలు దిగువకు పడిపోయినంత మాత్రాన, దేశమంతటా ప్రజలలో జీర్ణించుకుపోయిన ఆలోచనలు పలచబడినట్టు కాదు. లౌకిక వాదం అంటే చెరో బుజ్జగింపు, చెరొక బెదిరింపు అని కాంగ్రెస్ అప్పటికీ ఇప్పటికీ నమ్ముతుంది. షాబానో కేసులో ముస్లిం మతవాద, సామాజిక ఛాందసులను మెప్పించడానికి చట్టసవరణ చేసిన రాజీవ్ గాంధీ, దానికి సమతూకం కింద నిద్రావస్థలో ఉన్న అయోధ్య వివాదాన్ని నిద్రలేపారు. రామాలయ ఉద్యమానికి ఘనతను ఆడ్వాణీకి ఇచ్చారు కానీ, రాహుల్ తండ్రికి కూడా ఆ కీర్తిలో వాటా ఉంది. 1986 నుంచి మొదలై, కరసేవలు, రథయాత్రలు, ప్రభుత్వ పతనాలు, కూల్చివేతలు, కోర్టు కేసులు, పేలుళ్లు, ఘర్షణలు, రైలుబోగీ దగ్ధాలు, దారుణ ఊచకోతలు, ఈ వివాదం దారిలో మైలురాళ్లుగా ఉన్నాయి. సుమారు నాలుగువేల మంది సంబంధిత హింసాకాండలో చనిపోయారు. ఇంతటి తగవునూ న్యాయస్థానాలు భూమి తగాదాగా భావించి, తోచిన విధంగా పరిష్కరించాయి. ఈ కల్లోల ప్రయాణం చివర రామాలయ నిర్మాణం ఒక పక్షానికి ఘన విజయమే. ఒక ఆరాటం నెరవేరింది. పోరాటం ముగిసింది. ఫైజాబాద్ ఎన్నికలో బీజేపీ గెలవనంత మాత్రాన, ఉద్యమమే ఓడిపోయిందని ఎట్లా అంటారు? రాహుల్ గాంధీ ఏదో పొరపాటు మాట్లాడాడని కాదు, పొరపాటు అవగాహనతో ఉన్నారన్నది ?సమస్య. ఎన్నికల విజయాలు, సైద్ధాంతిక విజయాలని, తాము అధికారంలోకి రావడమే ప్రజలకు విముక్తి అని ఆయన అనుకుంటే, ఇప్పుడు పెరుగుతున్న జనాభిమానం ఎంతో కాలం నిలవదు. కొద్దిపాటి విజయాలనే, అతిగా ఊహించుకుని ప్రగల్భించడం రాజకీయాలలో వివేకం అనిపించుకోదు. మోదీ పరివారం తనను 'పప్పు' అని గేలిచేసినప్పుడు, 'పప్పు' లాగా, ఇప్పుడు 'బాలకుడ'ని తీసిపారేస్తున్నప్పుడు, నిజంగానే బాల్యచాపల్యంతోను రాహుల్ గాంధీ ఉన్నారేమో అనిపిస్తోంది. పిల్లవాడేమీ కాదు, సాంకేతికంగా చూస్తే యువకుడూ కాదు, కానీ, రాహుల్ గాంధీలో పరవళ్లు తొక్కే ఉత్సాహం ఉన్నమాట నిజం. ఆ ఉత్సాహం కొన్నిసార్లు అత్యుత్సాహంగా వ్యక్తమై, వెక్కిరింతలకు ఆస్కారం ఇస్తోంది. బీజేపీ హేళనలు వినోదం కోసం రూపొందించినవి కావు. వాటి వెనుక చాలా అర్థముంది. అసమర్థుడని చెప్పడానికి పప్పు అన్న మాటను ఉపయోగించారు. ఇటీవలి రాహుల్‌ను చూశాక, ఆ మాటకు కాలం చెల్లిందని అర్థమైంది. అందుకని, కొత్తగా అపరిపక్వుడనే అర్థంలో 'బాలక్'ను ప్రయోగిస్తున్నారు. ఆయన ఆలోచనలు, మాటలు ఇట్లాగే కొనసాగితే, మోదీ కాదు, ప్రజలు కూడా ఆయనను బాలకుడనే అనుకుంటారు. లోక్‌సభలో మాట్లాడుతూ, శివుడి బొమ్మను ప్రదర్శిస్తూ, సర్వమతాల్లోని అభయముద్ర గురించి వివరిస్తున్నప్పుడు, రాహుల్ గాంధీ ప్రయత్నం, తపన నచ్చినట్టుగా, అందులోని విషయం ఆకట్టుకోలేదు. మతాలకు, ముఖ్యంగా హిందూమతానికి తాను వ్యతిరేకిని కాదని చెప్పుకోవడంతో పాటు, మతబోధనలలో నుంచి హింసాద్వేషాలను వ్యతిరేకించడమనే చట్రంలో ఆయన మాట్లాడారు. ఇంతగా ప్రయాసపడీ, ప్రసంగం చివరలో మాట్లాడిన మాటలు ప్రభుత్వపక్షానికి ఆయుధాలు అందించాయి. రాహుల్ తప్పుగా మాట్లాడారని కాదు. ప్రత్యక్ష ప్రసారాలు చూసినవారందరికీ తెలుసు, ఆయన హిందువులందరినీ హింసావాదులు అనలేదు. హిందువులమని చెప్పుకునే వారు, హింసను ఆచరిస్తున్నారంటూ, తాను ఆ మాటలను బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ను దృష్టిలో పెట్టుకుని అంటున్నానని చెప్పారు. ప్రకటనలో వివాదం తొంగిచూస్తున్నప్పుడు, ఆ మాటల చివరలో ఉన్న వివరణను ఎవరు పట్టించుకుంటారు? రాహుల్ హిందువులను అందరినీ ఉద్దేశించి ఆ మాటలు అన్నారన్న వాదన బిగ్గరగా వినిపించసాగింది. అనుభవజ్ఞుడైన, పరిపక్వత కలిగిన నాయకుడు తప్పుగా మాట్లాడకపోవడమే కాదు, తప్పుగా వ్యాఖ్యానించడానికి ఆస్కారం కూడా ఇవ్వకూడదు. ఆ నాటి రాహుల్ ప్రసంగం దేశవ్యాప్తంగా చాలామందిని ఆకట్టుకుంది, కానీ, ఆ ఆకర్షణ ముందు తాము చిన్నబోకుండా, ఈ హింసావివాదం బీజేపీని రక్షించింది. బీజేపీ సొంతంగా మెజారిటీ దక్కించుకోలేకపోయిందన్న విషయానికి రాహుల్ కొంతకాలం విశ్రాంతి ఇవ్వడం మంచిది. దాని మీద ఇప్పటికే చాలా మాట్లాడారు. ఇక చాలు. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పక్షాలు, ఈ ఎన్నికల్లో నిరూపించిన విషయమేమిటంటే, నరేంద్రమోదీని బలహీనపరచడం అసాధ్యమేమీ కాదని. తన విజయం బేషరతుదేమీ కాదని, తాను అజేయుడేమీ కాదని నరేంద్రమోదీ కూడా తెలుసుకునే ఉంటారు. తమ విజయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ప్రతిపక్ష కూటమి, తన అపజయాన్ని అధిగమించడానికి మోదీ ప్రయత్నించాలి. ఎవరు పొరపాట్లు చేసినా, అవి వారి అవకాశాలను దెబ్బతీస్తూ పోతాయి. ద్వేషపు సంతలో ప్రేమ దుకాణాన్ని తెరుస్తున్నామని చెప్పిన రాహుల్ గాంధీ, జోడో యాత్రలలోను, పార్లమెంటులోను, ఎన్నికల ప్రచారంలోను మెరుపు ప్రచారం కాకుండా, క్షేత్రస్థాయిలో తమ పార్టీ యంత్రాంగం చేత సామరస్య, సోదరత్వ కృషి చేయించాలి. రాహుల్ నీతివచనాలు ఒక తీరుగా, కాంగ్రెస్ నేతల ఆచరణలు మరొక రీతిగా ఉంటే, బాలక బిరుదు పోయి, ద్వంద్వత్వ విమర్శలు ఎదురవుతాయి. ఇప్పటికే, రాహుల్ మాట, కాంగ్రెస్ చేత గురించిన ప్రచారం ఢిల్లీలో బలంగానే మొదలయింది.

# తెలంగాణలో గ్రూప్ 2, 3 పరీక్షలు వాయిదా వేశారా





హైదరాబాద్, జూలై 11 : తెలంగాణలో గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. పోస్టులు పెంచి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థుల రిక్వెస్ట్‌ను పరిగణనలోకి తీసుకుని ఎగ్జామ్ రీషెడ్యూల్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. రీ షెడ్యూల్ అయిన తెలంగాణ గ్రూప్ 2, గ్రూప్ 3 ఎగ్జామ్ డేట్లు అని ఓ ప్రకటన సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఆ నోటీసుపై టీజీపీఎస్సీ అధికారులు స్పందించారు.తెలంగాణలో త్వరలో జరగనున్న గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల తేదీలు మార్చేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ ప్రకటనలో వాస్తవం లేదని, అదంతా ఫేక్ న్యూస్ అని టీజీపీఎస్సీ క్లారిటీ ఇచ్చింది. అభ్యర్థులు వాటిని నమ్మకూడదని, అధికారిక ప్రకటనల్ని మాత్రమే విశ్వసించాలని సూచించింది. గ్రూప్ 2 ఎగ్జామ్ ఆగస్టులో జరగాల్సి ఉండగా, నవంబర్ 17, 18 తేదీలలో నిర్వహించడానికి టీజీఎస్సీ రీషెడ్యూల్ చేసిందని ప్రచారం జరిగింది. అదే విధంగా గ్రూప్ 3 ఎగ్జామ్ నవంబర్ 24, 25 తేదీలకు వాయిదా వేసినట్లు టీజీసీఎస్సీ పేరుతో ఓ ప్రకటన వైరల్ అయింది. దానిపై టీజీపీఎస్సీ స్పందించి క్లారిటీ ఇచ్చింది. గ్రూప్ 2, గ్రూప్ 3 నియామక పరీక్షలను వాయిదా వేయలేదని, అభ్యర్థులు ఇలాంటివి నమ్మవద్దని సూచించారు.తెలంగాణలో మొత్తం 783 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 29 డిసెంబర్ 2022న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు మొత్తం 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఒక్కో పోస్టుకు దాదాపు 700 మంది చొప్పున పోటీ నెలకొంది. గత ఏడాది నవంబర్ నెలలో గ్రూప్ 2 ఎగ్జామ్ నిర్వహించాల్సి ఉండగా, ఎన్నికలు రావడంతో వాయిదా వేశారు. తాము అధికారంలోకి రాగానే జనవరిలో గ్రూప్ 2 ఎగ్జామ్స్, వెంటనే గ్రూప్ 3 సైతం నిర్వహిస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పింది. అసెంబ్లీ ఎన్నికలు జరగడం, బీఆర్ఎస్ ఓడిపోవడం జరిగిపోయాయి. కాంగ్రెస్ తెలంగాణలో తొలిసారి అధికారంలోకి రాగా, జనవరిలో నిర్వహించాల్సిన గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశారు. టీజీపీఎస్సీ కొత్త చైర్మన్ గా మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిని నియమించి పోస్టుల భర్తీపై ఫోకస్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ పోస్టులు పెంచడంతో పాటు పరీక్షను వాయిదా వేసి, రీషెడ్యూల్ చేయాలన్న డిమాండ్ వస్తోంది. అభ్యర్థులు టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ సహా వీలున్న చోట నిరసన తెలుపుతున్నారు. డీఎస్సీ సైతం పోస్టులు పెంచాలని, పరీక్షలు వాయిదా వేసి పకడ్బందీగా నిర్వహించాలని కోరుతున్నారు. మహిళా అభ్యర్థులు సైతం రాత్రి అని చూడకుండా ఓయూ వద్ద నిరసన తెలిపారు. సిలబస్ చాలా పెంచారని, తక్కువ సమయంలో సబ్జెక్ట్ చదవడం పూర్తి కాదని, ప్రభుత్వం తమ సమస్యల్ని పట్టించుకోవాలన్నారు.

# వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో సంపుల నిర్మాణం

హైదరాబాద్, జూలై 11 : వర్షాకాలంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కార్యచరణ చేపట్టింది తెలంగాణ సర్కార్. వాటర్ లాగింగ్ పాయింట్స్‌పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షపు నీళ్లు రోడ్లపై నిలకుండా సంపులు కడతామంటోంది తెలంగాణ సర్కారు. అందుకు సంబంధించి యాక్షన్ స్టార్ట్ చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ జంక్షన్, రాజ్ భవన్ రోడ్డులోని లేక్ వ్యూ గెస్ట్ హౌస్, సోమాజిగూడ ఆర్టీఏ ఆఫీస్ ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపులను నిర్మించనున్నట్లు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ వెల్లడించారు. వర్షాకాలం వచ్చేసింది. చినుకు పడితే హైదరాబాద్ నగర వాసుల్లో వణుకు పుడుతుంది. ఎక్కడ మ్యాన్ హోల్స్ ఉన్నాయో తెలియని పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో అయితే వర్షపు నీటిప్రవాహానికి గల్లీలన్నీ నీట మునిగిపోతాయి. వరద ఉధృతి తీవ్రంగా ఉంటుంది. వాటిని అధిగమించడం కోసం సరికొత్త ప్రణాళికలు రూపొందించారు బల్దియా అధికారులు.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు దానకిశోర్. వర్షకాలంలో నీళ్లు నిలిచి ఉండే 140 ప్రాంతాల్లో.. సంపులు నిర్మించడానికి తగిన స్థలాన్ని గుర్తించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను ఆయన ఆదేశించారు. మొదటగా ఖైరతాబాద్ జోన్, జూబ్లీహిల్ సర్కిళ్లలో సంపులు నిర్మిస్తామన్నారు దానకిశోర్. మొత్తం 11 ప్రాంతాల్లో 20 కోట్ల రూపాయలతో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంపులు నిర్మిస్తామని వెల్లడించారు. వర్షం కురిసే సమయంలో ఈ సంపుల్లో నీటిని సేకరించి.. సమీపంలో ఉన్న నాలాల్లో పంపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్లు, ఎస్ఈలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్. మొత్తంగా.. సీఎం ఆదేశాలతో వాటర్ లాగింగ్ ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు మున్సిపల్ శాఖ అధికారులు. త్వరతగతిన సంపులు నిర్మించేందుకు స్థల సేకరణలో బిజీ అయ్యారు.

# మెడికల్ కాలేజీలకు అనుమతి నిరాకరణ




హైదరాబాద్, జూలై 11 : రేవంత్ రెడ్డి సర్కారుకు నేషనల్ మెడికల్ కమిషన్ షాకిచ్చింది. రాష్ట్రంలో ఎనిమిది కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతి నిరాకరించింది. 2024-25 విద్యాసంవత్సరానికిగానున గద్వాల, మెదక్, ములుగు, షాద్‌నగర్, నారాయణపేట, యాదాద్రి, కుత్బుల్లాపూర్, నర్సంపేటలలో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తెలంగాణ దరఖాస్తు చేసుకుంది. ఒక్కో కాలేజీలో 50 సీట్లు కేటాయించాలని కోరింది. అయితే, అవసరమైన నిబంధనలు పాటించడంలో విఫలమయ్యారంటూ అనుమతిచ్చేందుకు ఎన్ఎంసీ నిరాకరించింది. నిబంధనల ప్రకారం.. కొత్తగా 50 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల ఏర్పాటు కావాలంటే.. 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. అంటే మొత్తంగా 59 మంది బోధన సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి. అయితే ఈ కొత్త 8 కాలేజీల్లో ప్రిన్సిపాళ్లు, హాస్పిటల్ సూపరింటెండెంట్లు తప్ప మిగతా సిబ్బంది నియామకం జరగలేదు. ఇటీవల ఎన్ఎంసీ బృందం తనిఖీలకు వచ్చింది. ఈ సందర్భంగా అసలు ఫ్యాకల్టీ లేకపోవడంపై ఎంఏఆర్బీ( తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయా కళాశాలల్లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ.. ప్రిన్సిపాళ్లకు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. అలాగే కొత్త మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లో అవుట్ పేషంట్స్, ఇన్‌పేషంట్స్‌పై కూడా ఎన్ఎంసీ అసంతృప్తి వ్యక్తం చేసింది.ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను వైద్యారోగ్యశాఖ 60 రోజుల్లోగా సవరించుకోవాల్సి ఉంటుంది. లేకపోతే అనుమతులు మంజూరుచేయరు. అయితే ఈ లోగా కొత్త కాలేజీలకు సంబంధించి నియామక ప్రక్రియ పూర్తికావటం అనేది అనుమానమే. ఇటీవల అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినవారిని కేటాయించినా.. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ల నియమాక ప్రక్రియ ఎప్పుడు ప్రారంభం అవుతుందో, ఎపుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులపై శ్రద్ధ పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. సిబ్బంది నియామకాలకు సంబంధించి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ మొదటి నుంచీ వైద్యారోగ్యశాఖకు గుర్తు చేస్తున్నా పట్టించుకోలేదు.మెడికల్ కాలేజీల అనుమతి అంశాన్ని పునఃపరిశీలించాలని ఎన్ఎంసీని కోరాలని డీఎంఈ నిర్ణయించింది. మరోసారి దరఖాస్తు చేసేందుకూ కసరత్తు చేస్తోంది. కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం నుంచే అన్ని విభాగాలు, అనుబంధ బోధనాసుపత్రి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఎన్ఎంసీ నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి. ఈ విషయమై డీఎంఈ ఉన్నతాధికారులు మాట్లాడుతూ.... షాద్‌నగర్, కుత్బుల్లాపూర్ మినహా మిగిలిన ఆరింటికి అనుమతులు వస్తాయని భావించాం. భవనాల సమస్య లేకున్నా కొన్నిచోట్ల అనుబంధ ఆసుపత్రులు, సిబ్బందిపై ఎన్ఎంసీ అసంతృప్తి వ్యక్తంచేసింది. బోధనా సిబ్బందిని సర్దుబాటు చేసే ప్రక్రియ కొనసాగుతుండగానే నిర్ణయం వెలువడింది.

# ఇల్లెందులో పవర్ రిజర్వాయర్



ఖమ్మం, జూలై 11 : తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి. బొగ్గు ఉత్పత్తితోపాటు థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తితో మహారత్న కంపెనీలకు దీటుగా లాభాలు గడిస్తోంది. తాజాగా వినూత్న ఆలోచనతో తెలంగాణలో పవర్ రిజర్వాయర్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. సంస్థతోపాటు రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో భాగస్వామి కావాలని భావిస్తోంది.సాధారణంగా రిజర్వాయర్ అంటే.. మనకు ఆనకట్టలు, డ్యాంలు గుర్తొస్తాయి. కానీ, పవర్ రిజర్వాయర్ పేరుతో సింగరేణి కొత్తరకంగా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందిస్తోంది. ఇందుకు బొగ్గు నిల్వలు పూర్తయిన గనిని ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఇందులో పీఎస్పీపీ(పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్) నిర్మించబోతోంది. దిగువన ఒక రిజర్వాయర్, పైన ఒక రిజర్వాయర్ నిర్మించి విద్యుత్ డిమాండ్ తక్కువగా(ఆఫ్ పీక్ అవర్స్) ఉన్నప్పుడు కింది రిజర్వాయర్ నుంచి నీటిని పైకి తోడిపోస్తారు. పవర్ డిమాండ్ (పీక్ అవర్స్) ఉన్నవేళల్లో ఆ రిజర్వాయర్ నుంచి కిందకు పంపిస్తూ జలవిద్యుత్తు ఉత్పత్తి చేస్తారు.ఇక నీటిని ఎత్తిపోయడానికి సౌర విద్యుత్ వినియోగించేలా సింగరేణి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తిని హైబ్రీడ్ పవర్ జనరేషన్ అని కూడా అంటారు. ప్రైవేటు రంగంలో ఇలాంటి ప్లాంట్లు వస్తున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని సింగరేణి ఆ దిశగా ఆలోచన చేయడం శుభ పరిణామం.ఈ హైబ్రిడ్ పవర్ జనరేషన్ సింగరేణికి చాలా ఈజీ. భూగర్భ గనులు అయినా, ఓపెన్‌కాస్ట్ గనులు అయినా కిలోమీటర్లకొద్దీ తవ్వుతారు. ఓసీపీల్లో బొగ్గు నిల్వలు పూర్తయిన వాటిని హైబ్రిడ్ పవర్ జనరేషన్‌కు ఉపయోగించుకోవాలని సింగరేణి భావిస్తోంది. వాటిలో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంటు నిర్మాణాలు చేపట్టాలని ప్లాన్‌చేస్తోంది.సింగరేణి యాజమాన్యం ఆలోచన వెనుక రెండు లాభాలు ఉన్నాయి. ఒకటి సంస్థకు అవసరమైన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడం. తర్వాత కమర్షియల్‌గా సంస్థకు అదనపు లాభాలు చేకూర్చడం. ఇక థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో పెరుగుతన్న కాలుష్యం నియంత్రించే ఆలోచన. ఇలా అన్నిరకాల ప్రయోజనాల కోసం సింగరేణి హైబ్రిడ్ విద్యుత్ ఉత్పత్తి వెనుక ఉన్నాయి.సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి దిశలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అవి దేశంలో పెరగాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో థర్మల్ ప్లాంట్లపై ఆధారపడే అవసరం ఉండదు. ఈ క్రమంలోనే తెలంగాణలో సింగరేణి వినూత్న ఆలోచన చేసింది.ప్రస్తుతం సింగరేణి సంస్థ ఇల్లెందులో 100 మెగావాట్ల పీఎస్పీపీతో పవర్ రిజర్వాయర్ నిర్మించాలని భావిస్తోంది. ఇందుకు రూ.6 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తోంది. తద్వారా నిరుపయోగంగా ఉండిపోయే గని ప్రాంతాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకురావచ్చు. అని సింగరేణి ఈ దిశగా అడుగులు వేస్తోంది.

# రైతు రుణమాఫీ అడుగులు

హైదరాబాద్, జూలై 11 : రైతు రుణమాఫీ... దీని కోసం తెలంగాణ రైతులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి చూపిస్తామని లోక్‌సభ ఎన్నికల ముందు సవాల్ చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. అన్నట్టుగానే వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. వచ్చే వారం నుంచే పంట రుణమాఫీ ప్రారంభంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం అవసరమైన నిధులను సమకూర్చుకుంటోంది. రెండు రోజుల్లోనే రుణమాఫీకి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే... పంట రుణమాఫీకి సంబంధించి... మార్గదర్శకాలను అధికారులు సిద్ధం చేశారు. ఆ ఫైల్ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టేబుల్‌పైకి వెళ్లింది. ఒకటి, రెండు రోజుల్లో మార్గదర్శకాలకు ఆమోద్రముద్ర పడుతుంది. తెలంగాణ రైతులకు రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఆ సమయంలో తీసుకున్న 2లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేసేందుకు... సుమారు 31 వేల కోట్లు అవసరమవుతాయని కూడా... కేబినెట్ ప్రాథమికంగా అంచనా వేసింది. దీంతో.. నిధుల సమీకరణను వేగవంతం చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇప్పటికే 10వేల కోట్ల రూపాయల వరకు సమకూర్చుకున్నట్టు తెలుస్తోంది. మిగతా 21 వేల కోట్ల రూపాయలు సేకరించేందుకు మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌లో 4వేల కోట్లు, మేలో 4వేల కోట్లు, జూన్‌లో 5వేల కోట్ల రూపాయల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించారు. జులై, ఆగస్టు నెలల్లో తీసుకునే మార్కెట్ రుణాల్లోనూ కొన్ని నిధులను రుణమాఫీకి మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జులైలో 6వేల 500 కోట్లు.. ఆగస్టు నెలలో 5వేల కోట్లు రుణం తీసుకోవాలని భావిస్తోంది. అలాగే... హైదరాబాద్ చుట్టుపక్క లున్న ప్రభుత్వ భూములను ప్రైవేట్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి... రుణాలు తీసుకోవాలని కూడా ఆలోచిస్తోంది. ఆ విధంగా మరో 10వేల కోట్ల రూపాయలు సమకూర్చుకోవాలని కసరత్తు చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం.రుణమాఫీని మూడు దశలుగా అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా లక్ష రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేయనుంది. ఆ తర్వాత ఒకటిన్నర లక్ష వరకు ఉన్న పంట రుణాలు మాఫీచేసి... చివరిగా మూడో దశలో రెండు లక్షల వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేయాలని ఆలోచిస్తోంది. ఇలా చేస్తే... కాస్త ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని... నిధుల సమీకరణకు కూడా సమయం ఉంటుందనేది తెలంగాణ ప్రభుత్వం యోచన. అయితే... మూడ విడతల్లో రుణమాఫీ చేసినా... మొత్తం ప్రక్రియ రోజుల వ్యవధిలోనే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏది ఏమైనా... వచ్చే వారంలో.... అంటే ఈనెల 15 తర్వాత రుణమాఫీని ప్రారంభించే అవకాశం ఉందని.. ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. రైతు రుణమాఫీతోపాటు.. రైతు భరోసాపై కసరత్తు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేసేందుకు... ఇప్పటికే రైతు భరోసా సదస్సులు నిర్వహిస్తోందిఖమ్మంతో మొదలుపెట్టి... ఈనెల 22 వరకు ఉమ్మడి జిల్లాల వారిగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తోంది. రైతులు, రైతు సంఘాల నేతల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. అందరి అభిప్రాయాలు సేకరించాక... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని కేబినెట్ సబ్‌కమిటీ విధివిధానాలపై ఒక నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందిస్తుంది. ఆ నివేదిక వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సభ ముందు పెడతారు. సభలోనే రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉంది.

రుణమాఫీ వారికి నో

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలలో ప్రధానమైనది రైతు రుణమాఫీ. ఆ రుణమాఫీకి




సంబంధించి ప్రస్తుతం ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రుణమాఫీ కోసం దాదాపు 31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఇవ్వడంతో రుణమాఫీ పథకానికి సంబంధించి ప్రభుత్వం అర్హులను గుర్తించే పనిలో పడింది. నిధుల లభ్యత లేని కారణంగా.. అర్హులకే రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా షాకింగ్ నిర్ణయం తీసుకుంది.మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రుణమాఫీ వర్తింప చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. రుణమాఫీ కోసం అవసరమయ్యే 31 వేల కోట్లకు.. ప్రభుత్వం ఇప్పటికే 10,000 కోట్లను సిద్ధం చేసుకుంది. టీజీ ఐఐసీ భూములను బ్యాంకులకు తనఖా పెట్టి మరో 10 వేల కోట్లను సమీకరించనుంది. రుణాల రూపంలో మరో 10 వేల కోట్లను ఏర్పాటు చేసుకోనుంది. ఒకే దఫాలో రెండు లక్షల పంట రుణాన్ని మాఫీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆగస్టులోగా ఈ రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రుణమాఫీ పథకం ప్రధాన కారణమైంది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం రుణమాఫీ విషయంలో పిల్లి మొగ్గలు వేయడంతో.. అలాంటి పరిస్థితి తలెత్తకూడదని రేవంత్ ప్రభుత్వం కట్టుదిట్టంగా అడుగులు వేస్తోంది. నిధుల లభ్యత లేకపోయినప్పటికీ.. ఉన్న వనరుల ఆధారంగా నిధులను సమీకరించుకుంటున్నది. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తం కాకముందే.. రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. అయితే ఈ రైతు రుణాల జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులను మొదట మినహాయించాలి అనుకున్నప్పటికీ.. ఆ తర్వాత ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

# 70 ఏళ్లు... 70 అడుగుల వినాయకుడు

హైదరాబాద్, జూలై 11 :

**వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ నిర్విఘ్నం**
**కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా**



సెప్టెంబరు 07 శనివారం వినాయక చవితి. విగ్రహాల తయారీ జోరందుకుంటోంది. ఊరూరా కొలువుతీరే మండపాలన్నీ ప్రత్యేకమే అయినా.. ఖైరతాబాద్ గణేష్ సందడే వేరు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఖైరతాబాద్ వినాయకుడికి విగ్రహం ఈ ఏడాది 70 అడుగులు రూపుదిద్దుకోనుంది. నిర్జల్ ఏకాదశి సందర్భంగా ఇప్పటికే కర్రపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సరిగ్గా వినాయకచవితికి వారం ముందు స్వామివారి విగ్రహం పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది సప్తముఖ మహాశక్తి గణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు పూజలందుకో నున్నాడు ఈ మేరకు ప్రధాన శిల్పి చినస్వామి రాజేంద్రన్ సహా నిపుణులంతా ఇప్పటికే పనుల్లో వేగం పెంచారు. ఈ ఏడాది పరిస్థితుల ప్రకారం ప్రపంచ శాంతితో పాటూ అందరికీ ఆయు రారోగ్యాలు కలిగేందుకు సప్తముఖ గణపయ్యను పూజించాలని చెప్పారు దివ్యజ్ఞాన సిద్ధాంతి గౌరీభట్ల విఠల శర్మ. ఆయన సూచనల మేరకు ఈ ఏడాది సప్తముఖాలతో వినాయకుడిని తయారు చేస్తున్నామని చెప్పింది ఉత్సవకమిటీ. 7 తలలు, 14 చేతులు, తలలపై నాగసర్పాలు...పీఠం అన్నీ కలిపి 70 అడుగుల ఎత్తులో భారీ లంబోదరుడు కొలువుతీరనున్నాడు. గతంలో తయారైన సప్తముఖ గణపతికి భిన్నంగా ఈ సారి విగ్రహాన్ని తయారుచేస్తున్నట్టు శిల్పి చెప్పారు. ఈ నెల 17 న నమూనా చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు. ఖైరతాబాద్ గణేశుడికి 70 ఏళ్ల చరిత్ర ఉంది.. 1954లో ఒక్క అడుగు వినాయకుడిని ఉత్సవాలు ప్రారంభించారు. ఆ తర్వాత ఏడాదికో అడుగు పెంచుకుంటూ 60 అడుగులకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది 70వ సంవత్సరం కావడంతో ఏకండా 70 అడుగు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. పూర్తిగా మట్టితో తయారుచేసిన ప్రతిమను మాత్రమే ప్రతిష్టిస్తామని ఉత్సవకమిటీ సభ్యులు పేర్కొన్నారు. వినాయక నవరాత్రులు అంటే ఖైరతాబాద్ ప్రత్యేకం అయినప్పటికీ భాగ్యనగరంలో బాలాపూర్, చార్మినార్ ,బడి చౌడీ వంటి ప్రాంతాల్లోనూ వైభవంగా వేడుకలు నిర్వహిస్తారు. పదకొండు రోజుల పాటూ పూజలందించడం ఒకెత్తైతే.. నిమజ్జన వైభవం చూసేందుకు రెండు కళ్లు సరిపోవు. నవరాత్రులు పూర్తైన తర్వాత పదో రోజు ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేరుస్తారు.

# క్రమం తప్పకుండా మన ఇంట్లో శుభ్రం చేసుకోవలసిన కొన్ని ప్రదేశాలు!




పగలంతా ఎక్కడెక్కడ పనిచేసి వచ్చినా రాత్రి వేళకు ఇంటికి చేరుకున్నాకే మన శరీరం, మనసుకు శాంతి మరియు విశ్రాంతి లభిస్తాయి. ఇందువల్లనే ప్రతిఒక్కరు తమకు సొంత ఇల్లు ఉండాలని తాపత్రయ పడటమేకాక, ఆ ఇంటిపై మమకారాన్ని పెంచుకుంటారు. అంతేకాక, వారి ఇంటిని సంరక్షించుకుంటూ, నాణ్యమైన ఉత్పత్తులు మాత్రమే ఇంట్లో ఉండేట్టు అమర్చుకుంటారు.ఒకసారి ఇవన్నీ జరిగాక, వారి దృష్టి అంతా, తమ ఇంటిని అందంగా ఉంచుకోవడంపై నిలుపుతారు. అందమైన కనిపిస్తోంది నిర్ధారించడానికి ఇష్టం. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఇంటి పరిశుభ్రతే దానికి అందాన్ని చేకూరుస్తుంది. అయితే, ఇంటిని శుభ్రపరిచే విషయంలో మనము నిర్లక్ష్యం వహించే ముఖ్యమైన ప్రాంతాలు కొన్ని ఉన్నాయి.ఈ వ్యాసం ద్వారా అటువంటి కొన్ని ప్రదేశాలను గురించి మనం మాట్లాడుకుందాము. ఇటువంటి ప్రదేశాలను శుభ్రపరిచుకునేందుకు ఉపయోగపడే కొన్ని సులభమైన చిట్కాలను మీకు తెలియజేస్తున్నాం. ఇది చదివి మీ ఇంటిని పరిశుభ్రత స్థాయిని ఇంకొక మెట్టు పైకి తీసుకుని వెళ్ళవచ్చు.ఎలక్ట్రానిక్ పరికరాలు:నేటి ప్రపంచంలో, మనమంతా ఎన్నో ఎలక్ట్రానిక్ పరికరాలకు యజమానులం. వాటి ఉపరితలాలు ఫోన్ కి మల్లే స్పర్శకు స్పందించేవి కావచ్చు లేదా కీబోర్డ్ వలే భౌతికమైనవి కావచ్చు. ఏదేమైనా, వీరిని తరచూ కుటుంబ సభ్యులు తమ అవసరాలకు అనుగుణంగా పంచుకుని వాడుకునే అవకాశం ఉంది.అటువంటి పరిస్థితిలో, ప్రతి వారం వాటి ఉపరితలాన్ని డిసిన్ఫెక్టెంట్ ను ఉపయోగించి శుభ్రంగా తుడవడం మంచిది. ఇలా చేస్తే ఒక కుటుంబ సభ్యుడు నుండి మరొక కుటుంబ సభ్యునికి సూక్ష్మక్రిములు బదిలీ కావు.తలుపు హ్యాండిల్స్:మన ఇంట్లో మన కుటుంబ సభ్యులందరూ తరచుగా తాకే ప్రదేశాలలో తలుపు హ్యాండిల్స్ ముఖ్యమైనవి. కనుక ఇవి సూక్ష్మక్రిములకు నెలవుగా మారతాయి. ఇంటి లోపల జరిగే చాలా వరకు బ్యాక్టీరియా వ్యాప్తికి, తలుపు హ్యాండిళ్లే కారణమని వైద్యులు కూడా ధృవీకరించారు.అందువల్ల, ప్రతి మూడు లేదా నాలుగు రోజులకు ఒకసారి క్రిమిసంహారక ద్రావణంతో తలుపు హ్యాండిలను తుడిచివేయడాన్ని ఒక అలవాటుగా మార్చుకోండి. ఇది మీ రిఫ్రిజిరేటర్ యొక్క హ్యాండిల్ కు కూడా వర్తిస్తుంది. ఇంట్లో ఎవరైనా కుటుంబ సభ్యుడు అనారోగ్యంతో ఉన్నట్లయితే, మీరు ఈ ప్రక్రియను ప్రతిరోజు చేపట్టాలి. ఇంట్లో క్రిములు వ్యాప్తిని అరికట్టడానికి, ఇది కీలక పాత్ర పోషిస్తుంది.టెలివిజన్ రిమోట్:ఇంట్లో వేర్వేరు వ్యక్తులు చాలా తరచుగా ఉపయోగించే ఒక అంశం. టెలివిజన్లో ఏదో చూసేటప్పుడు ప్రజల అలవాటు తినడానికి అలవాటు పడటం వలన ఇది జెర్మ్స్ యొక్క నిల్వను చేస్తుంది. రిమోట్ క్లీన్ ఉంచడానికి ఇది ఒక నెల ఒకసారి కనీసం ఒక క్షుణ్ణంగా శుభ్రపరిచే జరుగుతుంది నిర్ధారిస్తుంది ఉండాలి.దీని కొరకు, ముందుగా సర్క్యూట్ దెబ్బతినకుండా నివారించడానికి రిమోట్ లోని బ్యాటరీని తొలగించాలి. ఒక మృదువైన వస్త్రము మీద, కొన్ని చుక్కల క్లీనింగ్ ద్రావణాన్ని చల్లండి. దానితో మొత్తం రిమోట్ ను తుడవండి. ఇప్పుడు ఒక ఇయర్ బడ్ తీసుకొని దానిపై ఒక చుక్క క్లీనింగ్ ద్రావణాన్ని చల్లి రిమోట్ మూలలను శుభ్రంగా తుడవండి.రిమోట్ మూలల్లో ఇంకా మురికి చిక్కుకుని ఉన్నట్లయితే, ఒక టూత్ పిక్ ను ఉపయోగించి సురక్షితంగా తొలగించండి. మొత్తం రిమోట్ పొడిగా అయినంతవరకు రెండు నిమిషాల పాటు ఆగిన తర్వాత, బ్యాటరీని అందులో వేసి మళ్లీ ఉపయోగించుకోండి.డిష్ వాషర్:ప్రతి ఇతర ఎలక్ట్రానిక్ పరికరం మాదిరిగానే, మీరు డిష్ వాషర్ ను శుభ్రం చేసేటప్పుడు కూడా, హ్యాండిల్ తో మొదలు పెట్టాలి. ఒకసారి దీనిని శుభ్రపరచాక, క్రింద ఉన్న రాక్ ను బయటకు లాగి దానిలో ఒక కప్పు బేకింగ్ సోడాను చల్లండి. ఇప్పుడు ఒక కప్పు డిస్టిల్డ్ వినెగర్ తీసుకొని పైన ఉండే రాక్ లో ఉంచండి. డిష్ వాషర్ లోని మిగిలిన భాగం ఖాళీగా ఉండేట్టు నిర్ధారించుకోండి. ఇప్పుడు మీ డిష్ వాషర్ ని అన్నింటి కన్నా ఎక్కువ సమయం తిరిగే మోడ్ లి పెట్టి నడపండి. ఇలా చేస్తే, మీ డిష్ వాషర్ శుభ్రంగా, మంచి వాసనతో మరియు ప్రకాశవంతంగా మారుతుంది. ప్రతి రెండు లేదా మూడు వారాలకు ఒకసారి ఇలా చేస్తూ ఉండండి.పాత్రలను శుభ్రం చేసేందుకు వాడే స్పాంజులు:మీ పాత్రలను సమర్ధవంతంగా శుభ్రపరచాలంటే, మీరు శుభ్రమైన స్పాంజులను ఉపయోగించడమే కాక, వాటిపై ఎటువంటి ఇన్ఫెక్షన్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే మన పాత్రలను అది సక్రమంగా శుభ్రపరుస్తుంది. దీని కొరకు, మీ శుభ్రపరిచే స్పాంజిని నీటిలో ముంచి తరువాత మైక్రోవేవ్లో నేరుగా ఉంచాలి.మైక్రోవేవ్ ను ఫుల్ పవర్ లో రెండు నిమిషాల పాటు ఉంచండి. ఇలా చేస్తే స్పాంజు యొక్క రంధ్రాల్లి దాక్కున్న క్రిములలోని 99% తొలగింపబడతాయి. ముందు జాగ్రత్త చర్యగా, మీరు మైక్రోవేవ్ నుండి స్పాంజిని తొలగించడానికి ప్రయత్నించే ముందే, అది పూర్తిగా చల్లారిందో లేదో నిర్ధారించుకోండి.టాయిలెట్ వెలుపలి ఉపరితలంటాయిలెట్ ను శుభ్రం చేయడం అనేది చాలామంది దినచర్యలో సాధారణమైన భాగం. కొంతమంది .మాత్రం వారానికి ఒకసారి ఈ పని చేస్తారు. అయితే, వారు టాయిలెట్ వెలుపలి ఉపరితల శుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తారు.టాయిలెట్ లోపల వలే వెలుపల భాగం కూడా మురికి పడుతుందని గ్రహించండి. అటువంటి పరిస్థితిలో, టాయిలెట్ ను శుభ్రపరిచేటప్పుడు, కేవలం సీటును మాత్రమే కాక, మూత, ట్యాంక్, స్టాండ్ దిగువన మరియు ఇతర ఉపరితల ప్రాంతాలను శుభ్రపరచుకోవాలి. ఇలా మీరు టాయిలెట్ ను కడిగిన ప్రతిసారీ చేయాలి.అంతేకాక, ఫ్లష్ హ్యాండిల్ ను డిసిన్ఫెక్టెంట్ తో శుభ్రపరచాలి, ఎందుకంటే, అందరూ తమ చేతులతో దానిని పట్టుకుంటారు. మీ టాయిలెట్ లో సూక్ష్మక్రిములు పెరుకోకుండా ఉండాలంటే ఫ్లష్ చేసే ముందు టాయిలెట్ మూతను కిందికి దించడం అలవాటు చేసుకోండి.దీని వలన సూక్ష్మజీవులు గాలిలో కలవవు ఒకవేళ అలా చేయనట్లైతే సూక్ష్మక్రిములు గాలి ద్వారా టాయిలెట్ మొత్తం వ్యాపిస్తాయి. తద్వారా అనేక వ్యాధుల వ్యాప్తి చెందుతాయి.స్విచ్ బోర్డ్ లు:తలుపు హ్యాండిళ్ల లాగానే, ఇంట్లో మనం ఇతర వస్తువులను కూడా తరచుగా తాకుతూ ఉంటాం.ఒకరి చేతి నుండి ఇంకొకరికి చేతులకు క్రిములు తరచుగా ఇక్కడి నుండే బదిలీ అవుతుంటాయి. కనుక ఇంట్లో ఉండే ప్రతి స్విచ్ బోర్డ్ ను, శుభ్రపరచడానికి డిసిన్ఫెక్టెంట్ ద్రావణాన్ని వారానికి ఒకసారి అయినా ఉపయోగించవలసిన కనీస అవసరం ఉంది.సింకులు:ప్రతిరోజూ మనము సింక్ లో ఆహార వ్యర్థాలను గణనీయమైన స్థాయిలో పారవేస్తాము. కాలక్రమేణా, ఈ వ్యర్థాలు, సూక్ష్మజీవుల అభివృద్ధిని ప్రోత్సహించి, దుర్వాసనకు కారణమవుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే, మీరు పదిహేను రోజులకు ఒకసారి, సింకునిను శుభ్రపరిచదానికి ఈ క్రింది పద్ధతిని వాడాలి.ముందుగా కుళాయి ద్వారా నీటిని పూర్తిగా వదిలండి. ఆ తరువాత, ఐస్ ముక్కలను అందులో ఉంచండి. ఇది సింకును శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఐస్ ముక్కలకు ప్రత్యామ్నాయంగా, మీరు చిన్న చిన్న సున్నం ముక్కలను కూడా వాడవచ్చు. ఒకసారి వాటన్నింటినీ ఫ్లష్ చేసిన తరువాత, కొన్ని చుక్కల నిమ్మ రసం అందులో పిండితే సూక్ష్మజీవులు నశింపచేయడానికి మరియు తాజా సువాసనను కలిగించడానికి ఉంచడానికి ఉపయోగపడుతుంది.ఉప్పు మరియు పెప్పర్ సీసాలు:ఇవి మన ఇంట్లో జలుబు మరియు ఫ్లూను కలుగజేసే సూక్ష్మక్రిములు వృద్ధి చెందదానికి అనువైన ప్రాంతాలు. అయితే, వీటిని శుభ్రపరచడం చాలా తేలిక. మీరు చేయవలసినదల్లా, మీ డైనింగ్ టేబుల్ ను శుభ్రపరిచేటప్పుడు, ప్రతి రాత్రి ఉప్పు మరియు పెప్పర్ సీసాల మీద మూతలను తుడవడం మరువకండి.ఈ చిన్న పని, మీ ఇంటి పరిశుభ్రతని కాపాడడంలో మరియు మీ కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో చాలా సహాయంగా ఉంటుంది. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆ సీసాలు ఖాళీ చేసి, డిసిన్ఫెక్టెంట్ కలిపిన వేడినీటిలో 15 నిమిషాలు నానబెట్టి శుభ్రపరుచుకోవడం మంచిది. తరువాత వాటిని పొడిగుడ్డతో బాగా తుడవండి.ఒకసారి పూర్తిగా పొడిగా ఆరినాకే, మళ్లీ వాటిని ఉప్పు మరియు పెప్పర్ లతో నింపి వాడటానికి సిద్ధంగా చేసుకోండి.

# బట్టలపై ఏర్పడిన మొండి మరకలను తొలగించడం ఎలా ?

మీ బట్టలు మురికిగా తయారవ్వడానికి రకరకాల పదార్ధాలు అనగా ఫుడ్డు, డ్రింక్స్, ఇంక్, లిప్ స్టిక్, ఆయిల్ వంటివి కారణం కావచ్చు. ఒక్కొక్క రకమైన మరకకు – ఒక్కొక్క పరిష్కార మార్గాన్ని కలిగి ఉంటుంది. అలాగే మీ బట్టలు ఏ రకమైన మెటీ రియల్ను కలిగి ఉన్నదో దానిబట్టి మీరు ఎలా శుభ్రం చేస్తారనేదానిపై ప్రభావాన్ని చూపుతుంది.కాబట్టి, మీరు మీకు ఇష్టమైన బట్టలపై మరకలు ఏర్పడినప్పుడు మీరేమి చేస్తారు ? మీ బట్టలపై ఏర్పడిన వివిధ రకాల మరకలను తొలగి ంచడానికి కొన్ని ఉపయోగకరమైన చిట్కాలు ఇక్కడ ఉన్నాయి.వేర్వేరు బట్టలు మీద ఉన్న మరకలను ఎలా అరికట్టాలి ? వేర్వేరు బట్టలు మీద ఉన్న మరకలను ఎలా అరికట్టాలి ?మీరు బట్టలపై ఏర్పడిన మరకలను అరికట్టడానికి ప్రయత్నం చేసేటప్పుడు, మీరు బట్టలు ఎలాంటి మెటీరియల్ను కలిగి ఉన్నాయో కొంచెం ఆలోచించండి (అది కాటన్, సింథటిక్, ఉన్ని (లేదా) పట్టుకి సంబంధించినదా అని). ఇది మీ బట్టలపై ఏర్పడిన మరకలను ఎలా తొలగించాలో అన్న దానిపై ప్రభావమును చూపుతుంది. ఇలా ఏదైనా మీరు ట్రై చేయటానికి ముందు, మీ బట్టలపై ఉన్న లేబుల్ సూచించే సూచనలను, మార్గదం ్శకాలను మీరు తప్పక అను సరి ంచండి.కాటన్ బట్టలపై మరకలను తొలగించడం ఎలా ? కాటన్ బట్టలపై మరకలను తొలగించడం ఎలా ?కాటన్ అనేది చాలా మన్నికైన ఫాబ్రిక్, కాబట్టి మీరు ఈ ఫాబ్రిక్ను ఎలాంటి నష్టం వాటిల్లకుండానే మరకలను తొలగించడానికి అనేక రకాల పద్ధతులను ఉపయో గించ వచ్చు.సింథటిక్ బట్టలపై మరకలను తొలగించడం ఎలా ? సింథటిక్ బట్టలపై మరకలను తొలగించడం ఎలా ?మనము ధరించే వాటిలో అనేక రకాలైన సింథటిక్ వస్త్రాలు ఉన్నాయి, అవి సాధారణమైన మన్నికగలవి, కాబట్టి మీరు మరకలను తొలగించే పని చేసేట ప్పుడు మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి.తరచుగా సింథటిక్ ఫాబ్రిక్స్ను శుభ్రం చేయడానికి, ఎంజైములు కలిగి ఉన్న సాధారణ డిటర్జెంట్లకు బాగా స్పందిస్తాయి, కానీ బ్లీచ్ వంటి కఠినమైన రసాయనాలను ఉపయ ాగించడం మంచి ఆలోచన కాదు.సింథటిక్ బట్టలపై ఉన్న మం ్కలను తొలగించడం కోసం మీరు ఉపయోగించే స్టెయిన్ రిమూవర్లు వి ా



ు ల సురక్షితంగా ఉన్నాయా / లేవా అని ముందుగా తనిఖీ చేసుకోండి.ఉన్ని బట్టలపై మరకలను తొలగించడం ఎలా ? ఉన్ని బట్టలపై మరకలను తొలగించడం ఎలా ?మార్కెట్లో లభించే అనేక వాణిజ్యపరమైన స్టెయిన్ రిమూవర్లు, ఉన్ని ఫైబర్లను నష్టపరుస్తాయి, కనుక లేబుల్పై ఉన్న సూచనలను తప్పకుండా చదవండి.పెర్సిల్ సిల్క్ ఉ ఉన్ని వంటి మెటీరియల్ కొరకు రూపొందించిన నిర్దిష్టమైన డిటర్జెంట్లను ఉపయోగించండి, ఆపై మీ బట్టలను పొడిగా మార్చడం వల్ల సరైన ఆకారంను తిరిగి పొందగలదు.అవసరమైతే, స్పెషల్ గార్మెంట్ స్టెయిన్ చికిత్స కోసం ఒక ప్రొఫెషనల్ డిటర్జెంట్ను తీసుకోండి.సిల్క్ బట్టల నుండి మరకలను తొలగించడం ఎలా ? సిల్క్ బట్టల నుండి మరకలను తొలగించడం ఎలా ?మీరు ఒక చిన్న మరకలను నివారించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, సిల్క్ మీద సరైన డిటర్జెంట్ను ఉపయోగించడం ముఖ్యం, ఆ మరకలను తొలగించడానికి మొత్తం వస్త్రాన్ని నానబెట్టాలి.సిల్క్ నమ్మశక్యం కానంత సున్నితమైనది, కాబట్టి కఠినమైన మరకలను తొలగించడానికి డ్రై క్లీనర్ల సహాయం తీసుకోండి.సాధారణ మరకలను తొలగించడానికి పాటించవలసిన హోం రెమిడీస్ ! షాకింగ్: ఈ సులభ విధానంతో అతను కొన్ని రోజుల్లోనే తన జుట్టు పెంచుకున్నాడు ఈ అతి తేలిక పద్ధతితో అతను తన జుట్టును తిరిగి పెంచుకోగలిగాడు సాధారణ మరకలను తొలగించడానికి పాటించవలసిన హోం రెమిడీస్ !అన్ని రకాల మరకలను తొలగించబడేలా ఉన్న స్టెయిన్ రిమూవర్స్ కోసం మనమంతా పరుగులు తీస్తాము. కానీ మీ ఇంట్లో ఉన్న కొన్ని పదార్ధాలు ఈ మరకలను తొలగించటానికి కూడా సహాయపడతాయి. ఇలాంటి పద్ధతుల్లో మీరు పాటించేటప్పుడు మీ బట్టల పై ఉన్న రంగులు అస్పష్టంగా గాని, పూర్తిగా గాని తొలగిపోవని మీరు ముందుగా నిర్ధారించుకోండి. అందుకోసం మీరు ఒక గార్మెంట్స్ నిపుణుడి సలహాను తీసుకోవచ్చు.పాలతో చాక్లెట్ మరకలను తొలగించడం :- పాలతో చాక్లెట్ మరకలను తొలగించడం :- మొదటగా, ఆ బట్టలను ఫ్రీజర్లో ఉంచడం ద్వారా ఆ మరకలను గట్టిపడేలా చేయవచ్చు, ఆ తరువాత ఆ చాక్లెట్ను స్క్రాప్ చేయడం ద్వారా ఏ చాక్లెట్ మరకలను తొలగించవచ్చు.ఆ తరువాత, చాక్లెట్ మరకలు ఉన్న బట్ట వెనుక భాగంలో వేడి నీటిని పోయడం వల్ల, ఆ మరకలను కరిగిస్తుంది.ఆ మరకలను డిటర్జెంట్ను కడిగిన తర్వాత, ఆ బట్టలను 30 నిమిషాల నుంచి ఒక గంట వరకు పాలులో నానబెట్టండి.టమాటా మరకలు ఈ విధంగా తొలగించండి :- టమాటా మరకలు ఈ విధంగా తొలగించండి :-మీ బట్టలను సాధారణంగా వాష్ను చేయండి, అవసరమైతే మళ్ళీ మళ్ళీ వాష్ను చేయండి.వినెగార్తో టమోటా మరకలను తొలగించండితెల్లని వినెగర్ (1 - 2 టేబుల్ స్పూన్) లో 30 నిమిషాల పాటు మీ బట్టలను నానబెట్టండి.ఆపై మీ బట్టలను వాషింగ్ మిషన్లో ఉతికేముందు డిటర్జెంట్తో నేరుగా మరకలను వాష్ చేయండి.అవసరమైతే మళ్లీ మళ్లీ మీ బట్టలను వాష్ చేయండి.హేర్స్ప్రేని ఉపయోగించి ఇంక్ మరకలను తొలగించండి :- హేర్స్ప్రేని ఉపయోగించి ఇంక్ మరకలను తొలగించండి :-ఇంక్ మరకలను తొలగించడానికి ఇది చాలా గమ్మత్తైనదిగా ఉంటుంది. మిథైల్ ఆమ్లం (లేదా) హేర్స్ప్రేస్ వంటి ఒక ఆల్కహాల్-ఆధారిత ఉత్పత్తులలో మీ బట్టలను నానబెట్టండి, ఇది చాలా అద్భుతమైన పరిష్కార మార్గంగా ఉంటుంది.మీ బట్టలు పై ఉన్న మరకలు పూర్తిగా తొలగిపోయే వరకు బట్టలను డిటర్జెంట్ నీటిలో నానబెట్టండి. ఒకవేళ మీ బట్టలు రంగును కోలో ్పయేటట్లయితే సాధ ారణంగానే వాష్ చేయ ండి.లిక్విడ్ డిష్వాషింగ్తో ఆయి మరకలను తొలగించండి :- లిక్విడ్ డిష్వాషింగ్తో ఆయిల్ మరకలను తొలగించండి :-నూనె వంటి అనేక జిడ్డైన మరకలను డిష్వాషింగ్ లిక్విడ్తో (లేదా) వాషింగ్ డిటర్జెంట్లను నేరుగా మీ బట్టలపై అప్లై చేయడం వల్ల మీరు లాభం పొందవచ్చు.అవసరాన్నిబట్టి వాషింగ్ మిషన్లో మళ్ళీ మళ్ళీ మీ బట్టలను వాష్ చేయండి.ఉప్పుతో రక్తపు మరకలను తొలగించండి :- ఉప్పుతో రక్తపు మరకలను తొలగించండి :-మీ బట్టల పై ఏర్పడిన పొందవచ్చు.ఉప్పు మరియు చల్లని నీటితో మీరు ఒక పేస్ట్ను తయారు చేయాలి.రక్తపు మరకలు ఏర్పడిన 10-15 నిమిషాల్లోనే, ఆ పేస్ట్ను మరకలపై నేరుగా రుద్దండి.ఆ తర్వాత చల్లటి నీటితో మీ బట్టలను బాగా శుభ్రం చేసుకోవాలి.ఇలాంటివి చిట్కాలను ఉపయోగించి మీ బట్టలు పై ఏర్పడిన మొండి మరకలను సులభంగా తొలగించుకోవచ్చు.

# ఎలుకలు మరియు సాలెపురుగులను తరిమికొట్టడానికి పాటించవలసిన చిట్కాలు

చాలామంది మహిళలకు ఎలుకలన్నా, సాలెపురుగులన్నా చచ్చేంత భయం. ఇంట్లో వాటి ఉనికిని కూడా ద్వేషిస్తారు. వారి భయానికి మూలం మరియు కారణం గురించి నిజంగా ఆలోచించవలసినదే! ఇంట్లో ఎలుకలు మరియు సాలెపురుగులు ఉంటే, ఎటువంటి వారికైనా వాటితో కలిసి కాపురం చేయడం సాధ్యం కాదు.ఈ జీవులు ఇంటిని ఇబ్బందికరంగా మార్చేయటమే కాక, మన ఇల్లు మరియు చుట్టుపక్కల అనేక రకాల వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఫలితంగా, ఎలుకలు మరియు సాలెపురుగులు ఉన్న ఇళ్ళలోని సభ్యులు చాలా తరచుగా అనారోగ్యం బారిన పడుతున్నారు. ఊనీఎవ ఖీవఎవటతివబ ఎనీ ఉవబి ఖీతిట ాట ఓతిఇవ ంనిట ాజూతిటవతీబమన ఇంట్లో ఎలుకలు మరియు సాలెపురుగులు ఉండకూడదు అని నిర్ణయం తీసుకున్న తరువాత, వాటిని ఎలా వదిలించుకోవాలి అనేదే మన ముందున్న సమస్య. ఎలుకలను వదిలించుకోవటం చాలా కష్టమైన పని. వెలుపల ప్రపంచంలోని కఠినమైన వాతావరణంలో మనుగడ సాగించడానికన్నా, ఇవి ఒకసారి ఒక ఇంటిలోని సౌకర్యం మరియు వెచ్చదనానికి అలవాటు పడ్డాక, ఆ సుఖమే మేలని వదిలిపెట్టి వెళ్లవు.ఇవి మీ ఇంటి నలుమూలల్లో కాపురాలు పెట్టి, వాటి సంతానాన్ని దినదిన ప్రవర్ధమానం చేసుకుంటాయి. ఈ వ్యాసం ద్వారా, మీ ఇంట్లో ఎలుకలు మరియు సాలెపురుగులను వదిలించుకోవాలంటే, పాటించవలసిన చిట్కాలను గురించి తెలియజేస్తున్నాం.ఎలుకలు మరియు సాలెపురుగులను ఎలా వదిలించుకోవాలో అర్థం చేసుకోండి.ఇక్కడ మనస్సులో ఉంచుకోవలసిన మొట్టమొదటి విషయం ఏమిటంటే, ఈ జీవుల కంటి చూపు చాలా మందగించి ఉంటుంది కానీ వాటి ఆఘ్రాణ శక్తి అమోఘం. కనుక, మీరు దీర్ఘకాలికంగా ఎలుకలు మరియు సాలెపురుగులను తరిమికొట్టాలి అని కోరుకుంటే, మీరు ఈ లక్షణంపై గురిపెట్టండి.ఒక రకమైన ఘాటు లేదా బలమైన వాసన కలిగి ఉన్న పదార్ధాన్ని అవి సంచరించే ప్రదేశాల్లో ఉంచడం ద్వారా, వారు మీ ఇల్లు వదిలిపెట్టి పారిపోవడమే కాక తిరిగి అడుగు పెట్టనివ్వకుండా చేయవచ్చు.ఎలుకలు మరియు సాలెపురుగులను తరిమికొట్టడానికి పాటించవలసిన చిట్కాలు:1. టీ సంచులు: 1. టీ సంచులు:మీరు చేయాల్సిందల్లా ఒక గిన్నెలో వేడినీరు తీసుకుని, అందులో మూడు నుండి నాలుగు టీబ్యాగ్లను వేసి మరిగించాలి. ఈ వాసనకు సాలీడులు మరియు ఎలుకలు దూరంగా పారిపోతాయి కనుక, ఎంత ఘాటైన వాసన కలిగిన రుచి టీ సంచులు వేస్తే అంత మంచిది. అస్సాం టీ, నీలగిరి తేయాకు లేదా పిప్పరమింట్ టీ ఈ పనికి బాగా ఉపయోగపడతాయి.టీ సరిగ్గా మరిగిన తరువాత, మీరు నీటిని వడకట్టండి. ఇప్పుడు టీ సంచులను తీసుకొని ఇల్లంతటా పెట్టండి. కనీసం 6 నుండి 7 గంటల పాటు వీటిని కదపకుండా ఉండేట్టు చూడండి. ఎలుకలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో మాత్రం, టీ సంచులను అదనంగా ఉంచండి.మీ ఇంట్లోని ఎలుకలు మరియు సాలెపురుగులను సంపూర్ణంగా బయటకు వెళ్లగొట్టడానికి, ఇదే పనిని వరుసగా 2 నుండి 3 రోజుల పాటు పునరావృతం చేయండి.2. బిర్యానీ ఆకులు: 2. బిర్యానీ ఆకులు:భారతీయ మసాలా వంటకాలలో విరివిగా వాడే బిర్యానీ ఆకులు వాసన, రుచి తెలియనివారు చాలా అరుదుగా ఉంటారు. అయితే, ఇదే వాసన ఎలుకలు మరియు సాలెపురుగులు పని పట్టడంలో అద్భుతంగా



పనిచేస్తుందని చాలా మందికి తెలియదు.ఎలుకలు మరియు సాలెపురుగులను తరిమేయడానికి వీటిని ఉపయోగించడంలో, మీరు పెద్దగా శ్రమ పడవలసిన అవసరం లేదు. కేవలం, బిర్యానీ ఆకులను చిన్న చిన్న ముక్కలుగా చేసి ఈ అవాంఛిత జీవుల నివశించే ప్రాంతాల్లో ఉంచండి. బిర్యానీ ఆకుల యొక్క బలమైన వాసన వీటిని బయటకు పరుగులు పెట్టిస్తుంది.3. మింట్ టూత్ పేస్ట్: 3. మింట్ టూత్ పేస్ట్:ఎలుకలు మీ ఇంటిలోనికి ప్రవేశిస్తున్న మార్గాన్ని మీరు గుర్తించగలిగితే, ఈ పద్ధతి చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. మీరు చేయాల్సినదల్లా, ఎలుకలు ఇంట్లోకి ప్రవేశించే ద్వారం వద్ద ఎక్కువ పరిమాణంలో టూత్ పేస్టును అద్దండి. అంతేకాకుండా, మీ ఇంట్లోని బీరువాలు మరియు అల్మరాలు దిగువన కొంచెం టూత్ పేస్టు రుద్దండి. ఇది మీ ఇంట్లో ఉన్న ఎలుకలన్నింటి పని పడుతుంది.సాలెపురుగుల సాధారణంగా ఇంటి మూలల్లో , తలుపులు మరియు కిటికీల వద్ద గూడు కడతాయి.

# జ్యోతిష్య శాస్త్ర ప్రకారం ఇల్లు శుభ్రపరచాల్సిన విధి విధానాలు.

మన పూర్వీకులు జ్యోతిషశాస్త్రంలో మంచితనాన్ని విశ్వసించేవారు. మానవజాతి ప్రగతి సాధిస్తున్న క్రమంలో, మన జీవనాన్ని మరింత వైజ్ఞానిక దృక్పథంలో సాగించేందుకుదుకు ప్రయత్నాలు సాగించాము. క్రమంగా, మేము జ్యోతిషశాస్త్ర శాస్త్రాన్ని విస్మరిస్తూ, మన మనస్సు చెప్పిందే చేయడం మొదలుపెట్టాము. జ్యోతిషశాస్త్రం కూడా శాస్త్రీయ సూత్రాలపై ఆధారపడి ఉందనే విషయాన్ని మరచాము. జ్యోతిషశాస్త్రంలో వివరింపబడిన చాలా విషయాలు కాలపరీక్షకు ఎదురొడ్డి నిలిచాయి మరియు నిజమైనవిగా నిరూపింపబడ్డాయి. అటువంటి పరిజ్ఞానాన్ని తిరస్కరించినట్లయితే, అది మనలోని అవివేకాన్ని ఎట్టి చూపించుకోవడమే తప్ప మరేమీ కాదు.నేటి తరానికి చెందిన చాలామందికి, గృహ పారిశుభ్ర విషయంలో, జ్యోతిషశాస్త్ర పాత్ర గురించి అవగాహన లేదు. వారు ఇంటిని శుభ్రపరచడం అంటే, కేవలం ఇంటి అంతర్గత పరిసరాల నుండి మలినాలను తొలగించి, విసిరేసే సాధారణ ప్రక్రియగా భావిస్తున్నారు. ఏదేమైనా, ఈ పనిలో కూడా దానికి మించిన విషయం ఉందని మరియు దీనికి సంపదల దేవత అయినా లక్ష్మి దేవికి సంబంధం ఉందని వారు ఎరగరు.ఇల్లు శుభ్రపరిచే విషయానికి సంబంధించి అన్ని జ్యోతిషశాస్త్ర నియమాలు మరియు నిబంధనలు, సంపదతో అనుబంధం కలిగి ఉన్నాయి. ఈ వ్యాసం ద్వారా, జ్యోతిషశాస్త్ర పరంగా ఇంటిని ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం. మీరు ఆ నియమాలకు కట్టుబడి ఉండటానికి ఏమి చేయాలో కూడా తెలుసుకుందాం.? సంపద స్థాయి- లక్ష్మీ కటాక్షం: భారతీయ సంస్కృతిలో, లక్ష్మీదేవిని సంపదలకు అధిదేవతగా కొలుస్తారన్న వాస్తవం, మనకు తెలియనిది కాదు. శ్రేయస్సుకు మొట్టమొదటి సంకేతం. చాలామంది ప్రజలు తమ ఇంటిలోని ధనం యొక్క పెరుగుదల మరియు తరుగుదలను లక్ష్మి దేవి రాక మరియు పోకగా సంబోధిస్తారు.కనుక, జ్యోతిషశాస్త్ర అనుసారం, గృహసంబంధంగా లక్ష్మి దేవిని ఆకర్షించడానికి ఏమి చేయాలని చెప్తే, అదే విధంగా చేసేలా శ్రద్ధ తీసుకోవాలి.

# తక్కువ ఖర్చుతోనే అత్యాధునిక వైద్యం.. మెడికల్ టూరిజానికి హబ్‌గా హైదరాబాద్





వరల్డ్ క్లాస్ మెడికల్ ట్రీట్‌మెంట్ ఎక్కడో అమెరికా, యూరప్ వంటి దేశాల్లో అందుబాటులో ఉంటుందని చాలామంది భ్రమపడుతుంటారు. కానీ అంతకంటే గొప్ప చికిత్సా విధానం మన హైదరాబాద్‌లో అందుబాటులో ఉంది. ప్రపంచస్థాయి ప్రమాణాలు, అత్యాధునిక వైద్యపరికరాలు, నిష్ణాతులైన వైద్యులు.. వెరసి భాగ్యనగరం మెడికల్ టూరిజం హబ్ గా అవతరిస్తోంది. అవును.. వైద్య చికిత్స కోసం దేశ, విదేశాల చూపు.. ఇప్పుడు హైదరాబాద్ వైపు ఉంది. పలు రంగాలకు నిలయంగా మారిన హైదరాబాద్.. మెడికల్ టూరిజంలోనూ అంతే వేగంగా అభివృద్ధి చెందుతూ కొత్త పుంతలు తొక్కుతోంది. బెస్ట్ ట్రీట్మెంట్.. అదీ తక్కువ ఖర్చుతోనే కావాలనుకునే విదేశీ మెడికల్ టూరిస్టులు ఇప్పుడు హైదరాబాద్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఐటీ దిగ్గజ కంపెనీలన్నీ కొలువు దీరాయి. రాకెట్ వేగంతో ఫార్మా ఇండస్ట్రీ డెవలప్ అవుతోంది. అటు నిర్మాణం రంగానికి తిరుగులేదు. శాంతిభద్రతలకు ఢోకాలేదు. మానవ వనరులకు కొదవలేదు. ఇలా సకల రంగాల్లో టాప్ గేర్‌లో దూసుకుపోతున్న హైదరాబాద్.. మెడికల్ టూరిజంలోనూ అంతే వేగంగా అభివృద్ధి చెందుతోంది. మెరుగైన వైద్య చికిత్స అనగానే ఇప్పుడు తన వైపు చూసేలా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది హైదరాబాద్. విదేశాల్లో కూడా సాధ్యం కాని ఎన్నో క్లిష్టమైన సర్జరీలను విజయవంతంగా చేసి చూపించాయి ఇక్కడి ఆసుపత్రులు. గత పదేళ్లుగా చూసుకుంటే హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు ఓవర్సీస్ పేషెంట్ల తాకిడి ఎక్కువైంది. ఆఫ్రికా దేశాలైన నైజీరియా, సూడాన్, మిడిలీస్ట్ దేశాలు ఒమన్, ఇరాక్, యెమన్, ఇటు పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, ఆఫ్ఘన్ నుంచి కూడా రోగులు హైదరాబాద్ ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. అటు సంపన్న దేశాలైన అమెరికా, కెనడా, బ్రిటన్, రష్యా, ఆస్ట్రేలియా, చైనా వంటి దేశాల నుంచి కూడా మన భాగ్యనగరానికి వస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మెడికల్ టూరిజం కీలక పాత్ర పోషిస్తోంది. దాదాపు 80 దేశాల నుంచి 20 లక్షల మందికి పైగా రోగులు ప్రతియేటా చికిత్స కోసం భారత్‌కు వస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకు చెన్నై నగరానికి మెడికల్ హబ్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు ఉండేది. అయితే ఇప్పుడు హైదరాబాద్‌లోని వాతావరణ పరిస్థితులు, ఇతర దేశాలకు పెరిగిన విమాన కనెక్టివిటీ కారణాలతో భాగ్యనగరం చెన్నైకి గట్టి పోటీ ఇస్తోంది. మెడికల్ టూరిజంకు హైదరాబాద్ కేంద్రంగా మారుతుండటానికి పలు అంశాలు కారణమవుతున్నాయి. ప్రపంచ నలుమూలల నుంచి రోగులను ఆకర్షించే అద్భుతమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, నైపుణ్యం కలిగిన వైద్యులు, అత్యాధునిక సాంకేతికతను అంది పుచ్చుకుంటోంది హైదరాబాద్. వీటి అన్నిటికీ మించి సరసమైన ధరలకు చికిత్సలు అందించే అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రులకు మన హైదరాబాద్ అడ్డాగా మారిపోయింది. అందుకే హెల్త్‌కేర్ ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ కీ రోల్ పోషిస్తోంది. మెడికల్ హబ్‌గా హైదరాబాద్ ఎదగడానికి నిజాం కాలంలోనే భీజంపడింది. నిజాం రాజవంశం కాలంలోనే హైదరాబాద్ వైద్య విశిష్ట కేంద్రంగా ఖ్యాతి గడించింది. నిజాం కాలంలోనే హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌తో సహా పలు ప్రముఖ ఆసుపత్రులు ఏర్పాటు అయ్యాయి. భారతదేశంలో మొట్టమొదటి ఆధునిక ఆరోగ్య సంరక్షణ సంస్థల స్థాపనకు భాగ్యనగరం నిలయంగా నిలిచింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హెల్త్‌కేర్ వసతులు హైదరాబాద్‌లో కాలానుగుణంగా అప్‌గ్రేడ్ అవుతూ వచ్చాయి. అందుకే ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలో హైదరాబాద్‌ను అగ్రగామిగా నిలవడం వెనుక శతాబ్ద కాలానికి పైగా కృషి ఉంది. మెడికల్ టూరిజం కోసం హైదరాబాద్ ప్రాధాన్యత పెరగడానికి అనేక బలమైన కారణాలు ఉన్నాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించిన ఒక అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌కు వచ్చే విదేశీయులు ఒక్కొక్కరు సగటున 3,000 డాలర్ల నుండి 10,000 డాలర్ల వరకు ఖర్చు చేస్తున్నరట. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థను కొంత మెరుగుపరుస్తోంది. హైదరాబాద్‌లోని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు గత ఐదేళ్లలో ఏకంగా 40% వృద్ధిని సాధించడం విశేషం. ఇది మెడికల్ హబ్‌గా హైదరాబాద్‌కు పెరుగుతున్న గుర్తింపును సూచిస్తోంది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం, దేశంలోకి వచ్చే మొత్తం మెడికల్ టూరిస్టుల్లో సుమారు 30% మంది హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. ప్రముఖ మెడికల్ టూరిజం ఏజెన్సీ నిర్వహించిన సర్వేలో యునైటెడ్ స్టేట్స్, నైజీరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలకు చెందిన రోగులు హైదరాబాద్‌లోని అధునాతన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన వైద్య నిపుణులు, తక్కువ ఖర్చుతో అందించే వైద్య చికిత్సల కోసం హైదరాబాద్‌కు రావడానికి ఇష్టపడతారని నివేదికలు చెబుతున్నాయి. అమెరికా వంటి సంపన్న దేశాల్లో వైద్య చికిత్సల ఖర్చులతో పోల్చితే ఇక్కడ ఖర్చులు తక్కువ కావడంతో ఆ దేశాలకు చెందిన రోగులు కూడా హైదరాబాద్‌లో ల్యాండ్ అవుతున్నారు. చాలా వరకు సంపన్న దేశాల్లో వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుతో పోల్చితే హైదరాబాద్‌లో 70 శాతం మేర తక్కువగా ఉండటం విశేషం. గత మూడేళ్లుగా ఇండియన్ మెడికల్ టూరిజం గణనీయంగా పెరిగింది. వైద్య చికిత్సల కోసం వచ్చే విదేశీయుల సంఖ్య 2020లో 1,83,000 గా ఉంటే, 2021లో 3,04,000కి చేరుకుంది. దీన్ని బట్టి దేశంలో మెడికల్ టూరిజం ఎంత వేగంగా అభివృద్ధి చెందిందో అర్థమవుతోంది. మెడికల్ టూరిజం మార్కెట్ 2023 నుంచి 2027 మధ్య 20% కంటే ఎక్కువ నమోదు కావచ్చని అభిప్రాయపడుతున్నారు నిపుణులు. ఇక దేశంలోని బెస్ట్ హాస్పిటల్ ఉన్న నగరాల జాబితాలో హైదరాబాద్ టాప్ ఫైవ్ లో నిలిచింది. ద్వితీయ శ్రేణి నగరాలైన పుణె, కొచ్చిన్, అహ్మదాబాద్ లాంటి నగరాల్లో ఇప్పుడిప్పుడే మెడికల్ టూరిజం అభివృద్ధి చెందుతోంది. ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకున్నా.. కేవలం ఆ నోటా ఈనోటా వినడం ద్వారానే భారీ మార్కెట్ సంపాదించగలిగింది హైదరాబాద్. ప్రస్తుతానికి మెడికల్ టూరిజంలో దేశంలోనే ఐదో స్థానంలో ఉన్నా.. భవిష్యత్ లో నెంబర్ వన్ అవుతామని ఇక్కడి కార్పొరేట్ ఆసుపత్రులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మెడికల్ టూరిజం వ్యవస్థలో ఆసుపత్రులు, క్లినిక్‌లు, సర్జన్లతో పాటు మెరుగైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం కీలక అంశాలుగా ఉన్నాయి. చికిత్స అందించే పరిసరాలతో పాటు వైద్య ప్రయాణ సౌకర్యాలు, ప్రభుత్వ విధానాలు, నియంత్రణ సంస్థలు, బీమా, విమానయాన సంస్థలు, హోటళ్లతో సహా ఆతిథ్య రంగం హైదరాబాద్ వచ్చేలా ఆకర్షిస్తున్నాయి. హైదరాబాద్‌లో మెడికల్ టూరిజంను ప్రోత్సహించేందుకు రాష్ట్ర సర్కారు సైతం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోంది. శంషాబాద్?లో వెయ్యి ఎకరాల్లో మెడికల్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోస్తున్నట్లు ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# సామాన్యులకు షాక్.. భారీగా పెరిగిన ఇన్సూరెన్స్ పాలసీ ధరలు




న్యూఢిల్లీ, జూలై 11 : టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం ధరలు పెరిగాయి. భారీ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్, టాటా ఏఐఏలు కనిష్ఠంగా 1 శాతం, గరిష్ఠంగా 10 శాతం వరకు పెంచినట్టు ప్రకటించాయి. భారతీయ మూడో అతిపెద్ద జీవిత బీమా సంస్థ, రెండో అతిపెద్ద ప్రైవేట్ రంగ బీమా సంస్థ అయిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్.. తమ టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంల ధరలను దాదాపు 10 శాతం మేర పెంచినట్టు చెప్తున్నారు. అయితే 60 ఏండ్లకుపైబడినవారికే ఈ పెంపు వర్తిస్తుందని అంటున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ మొత్తం వ్యక్తిగత వార్షిక ప్రీమియంల విలువలో 5 శాతానికి సమానంగా దాని టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంల వాటా ఉన్నది. మరో ప్రైవేట్ రంగ బీమా కంపెనీ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా తమ టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంల ధరలను 1 నుంచి 6 శాతం మేర పెంచింది. ఆయా వయసులనుబట్టి ఈ పెంపులున్నాయి. మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వ్యక్తిగత వార్షిక బీమా ప్రీమియంలలో టర్మ్ ఇన్సూరెన్స్ వాటా 9 శాతం. ఇక బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ టర్మ్ పాలసీల రేట్లు 1 నుంచి 5 శాతం మేరకు పెరిగాయి. టాటా ఏఐఏ టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలూ 3 శాతం నుంచి 10 శాతం వరకు పెరిగాయి. బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ వ్యక్తిగత వార్షిక ప్రీమియంలలో టర్మ్ ఇన్సూరెన్స్ వాటా 6 శాతంగా ఉన్నది. మరికొన్ని కంపెనీలూ తమ బీమా ప్రీమియంల రేట్లను పెంచాలని చూస్తున్నాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ టర్మ్ పాలసీల ధరలు 3 శాతం నుంచి 5 శాతం వరకు పెరగవచ్చన్న సంకేతాలున్నాయి. అయితే ప్రభుత్వ రంగ బీమా సంస్థలు మాత్రం పెంపునకు నో అంటున్నాయి. ఎల్ఐసీ, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లు ఇప్పటికైతే పెంచబోవడం లేదంటున్నాయి. కాగా, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, జనాభా, స్థిరం గా సాగుతున్న రీఇన్సూరెన్స్ ఖర్చుల నేపథ్యంలోనే ప్రీమియంల ధరల్ని సవరించాల్సి వస్తున్నదని బీమా ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో టర్మ్ ఇన్సూరెన్స్‌లకు పెరుగుతున్న ఆదరణ కూడా రేట్ల పెంపునకు కారణమేనన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

# అమ్ముడుపోని కార్ల విలువ 60,000 కోట్లు



న్యూఢిల్లీ, జూలై 11 : ప్యాసింజర్ వాహన కొనుగోళ్లు మందగించడంతో.. డీలర్ల వద్ద అమ్ముడుపోని కార్ల నిల్వలు మునుపెన్నడూ లేనివిధంగా పేరుకుపోయాయి. ఆల్‌టైమ్ హైకి చేరిన ఈ ఇన్వెంటరీల విలువ రూ.60,000 కోట్లుగా ఉన్నట్టు ఆటో పరిశ్రమ చెప్తున్నది. వర్షాభావం, తగ్గిన రుణ లభ్యత, ఆర్థిక మందగమన పరిస్థితులు వాహన విక్రయాలను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తున్నట్టు ఆటోమొబైల్ డీలర్ల సంఘం సమాఖ్య (ఫడా) ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొదలు కార్ల అమ్మకాలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయంటున్న ఫడా.. సుమారు 6 నుంచి 6.5 లక్షల కార్లు ఊరికే అలా ఉండిపోయాయని, ఒక్కో కారు విలువ సగటున రూ.9.5 లక్షలుగా లెక్కించినా వీటి విలువ దాదాపు రూ.60,000 కోట్లుగా ఉంటుందని పేర్కొన్నది. గత రెండు నెలల్లో పెరిగిన స్టాక్ 77,000 యూనిట్లుగా ఉండటం గమనార్హం. మార్కెట్‌లో అమ్మకాలు క్రమేణా క్షీణిస్తుండటాన్ని గమనించిన ఆటో రంగ సంస్థలు.. కస్టమర్లను ఆకట్టుకొనేందుకు రకరకాల ఆఫర్లు, డిస్కౌంట్లనూ తెరపైకి తెస్తున్నాయి. టాటా, మహీంద్రా, మారుతి ఇటీవల ప్రకటించిన ధరల తగ్గింపు, వివిధ మాడళ్లపై ప్రవేశపెట్టిన ప్రయోజనాలే ఇందుకు నిదర్శనం. నిజానికి ఈ ఏడాది ఏప్రిల్ నుంచే స్తబ్ధత నెలకొన్నది. దీంతో కొత్త మాడళ్లకు, ఎస్‌యూవీలకూ డిస్కౌంట్లనిస్తున్నాయి కంపెనీలు. అయినప్పటికీ జూన్‌లో సేల్స్ పడిపోయాయి. చేసిన సరఫరా ఆధారంగా కంపెనీల లెక్కలు గతంతో పోల్చితే 4 శాతం పెరిగి 3,41,000 యూనిట్లకు చేరాయని చెప్తున్నా.. జరిగిన వాహన రిజిస్ట్రేషన్లు 2,81,000 మాత్రమే. దీంతో ఆ మిగిలిన కార్లన్నీ డీలర్ల వద్దే ఉండిపోయాయి. మారుతీ సుజుకీ రిటైల్ సేల్స్ 8 శాతం పతనమయ్యాయి. దీంతో డిస్కౌంట్లు ఎక్కువగా ఇవ్వాలని, షోరూంలు త్వరగా తెరిచి.. ఆలస్యంగా మూసుకోవాలని డీలర్లకు మారుతీ సూచించడాన్నిబట్టి మార్కెట్ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిరుడు జూన్‌తో చూస్తే గత నెల ప్యాసింజర్ వాహన అమ్మకాలు 6.77 శాతం దిగజారాయని ఫడా చెప్తున్నది. ఇక మే నెలతో పోల్చితే 7.18 శాతం పడిపోయాయి. మారుతీ, హ్యుందాయ్, టాటా మోటర్స్ సేల్స్ తగ్గిపోయినట్టు స్పష్టంగా కనిపించింది. కియా, స్కోడా, హోండా, ఎంజీ మోటర్, రెనాల్ట్ పరిస్థితీ ఇంతే. ఎక్స్‌యూవీ3ఎక్స్‌జీరోతో మహీంద్రాకు కొంత ఊపొచ్చింది. ఇక లగ్జరీ వాహన సంస్థల సంగతి చెప్పనక్కర్లేదు. పరిస్థితులు ఇలాగే ఉంటే కష్టమేనన్న ఆందోళన పరిశ్రమ నుంచి ఇప్పుడు వ్యక్తమవుతున్నది.

# అనంత్ గ్రాండ్ వెడ్డింగ్‌లో వీవీఐపీ ఏర్పాట్లు ఇలా.. 2500 రకాల ఆహార పదార్థాలు, కోట్ల ఖరీదు చేసే రిటర్న్ గిఫ్ట్స్..



అనంత్, రాధికల పెళ్లి రేపు అంటే జూలై 12న వివాహం జరగనుంది. ముంబైలోని జియో వరల్డ్ సెంటర్‌లో వివాహ వేడుకలు జరగనున్నాయి. ఈ పెళ్ళికి మన దేశం నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా చాలా మంది అతిథులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ఎలా చేస్తున్నారు? పెళ్ళిలోని విందులో ఏయే ఆహారాన్ని అందించనున్నారు? అతిథులకు అంబానీ కుటుంబం ఎలాంటి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వనున్నారో తెలుసుకుందాం. భారత దేశ కుబేరుడు, దేశంలోని అత్యంత సంపన్న వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ ఇంట వివాహ వేడుక సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. ముఖేష్, నీతా అంబానీల చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల పెళ్లి మరికొన్ని గంటల్లో జరగనుంది. అనంత్, రాధికల పెళ్లి రేపు అంటే జూలై 12న వివాహం జరగనుంది. ముంబైలోని జియో వరల్డ్ సెంటర్‌లో వివాహ వేడుకలు జరగనున్నాయి. ఈ పెళ్ళికి మన దేశం నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా చాలా మంది అతిథులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ఎలా చేస్తున్నారు? పెళ్ళిలోని విందులో ఏయే ఆహారాన్ని అందించనున్నారు? అతిథులకు అంబానీ కుటుంబం ఎలాంటి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వనున్నారో తెలుసుకుందాం. పెళ్లికి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జెడ్ ప్లస్ సెక్యూరిటీతో అంబానీ కుటుంబ సభ్యులందరూ పెళ్లికి హాజరుకానున్నారు. ఈవెంట్ సమయంలో ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ ఆపరేషన్ సిస్టమ్ సెటప్ చేయబడుతుంది. ఈవెంట్ భద్రతా ఆపరేషన్ ఈ కేంద్రం నుంచి పర్యవేక్షించబడుతుంది.


ఇంటర్నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్

60 మంది భద్రతా బృందంలో 10 మంది ఎన్ఎస్‌జి కమాండోలు, పోలీసు అధికారులు ఉంటారు. 200 మంది అంతర్జాతీయ భద్రతా సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది. 300 మంది సెక్యూరిటీ సభ్యులు ఉంటారు. %దీఖజ%లో 100 మందికి పైగా ట్రాఫిక్ పోలీసులు, ముంబై పోలీసు సిబ్బంది పెళ్లి వేడుక వద్ద మోహరించనున్నారు.

వివాహ విందులో ప్రత్యేకత ఆహారం ఏమిటంటే


వివాహ విందు కోసం 10 మందికి పైగా అంతర్జాతీయ చెఫ్‌లను ఆహ్వానించారు. ఇండోనేషియాకు చెందిన కోకోనట్ క్యాటరింగ్ కంపెనీ 100కి పైగా కొబ్బరి వంటలను సిద్ధం చేస్తుంది. మెను జాబితాలో 2500 కంటే ఎక్కువ వంటకాలు చేర్చబడ్డాయి. మద్రాస్ కేఫ్ నుంచి కాశీ చాట్, ఫిల్టల్ కాఫీ కూడా ఈ విందు లో ప్రముఖ ఆహారంగా చేర్చబడ్డాయి. ఇటాలియన్, యూరోపియన్ స్టైల్ ఫుడ్ కూడా అందించనున్నారు. ఇండోర్ కి చెందిన గరడు చాట్, ముంగ్లెట్ , కేసర్ క్రీమ్ వడ కూడా మెనులో చేర్చబడ్డాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు.

# యోగా గురువు బాబా రాందేవ్‌కు రూ.50లక్షల జరిమానా..!




ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌కు బాంబే హైకోర్టు బుధవారం రూ.50లక్షల జరిమానా విధించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన నేపథ్యంలో జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. పతంజలి ఆయుర్వేదానికి వ్యతిరేకంగా కర్పూరం ఉత్పత్తులకు సంబంధించి.. హైకోర్టులో ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనకు సంబంధించిన పిటిషన్ దాఖలైంది. గతేడాది ఆగస్టు 30న కర్పూరం ఉత్పత్తులు విక్రయించకుండా పతంజలిపై కోర్టు బ్యాన్ విధించింది. అయితే, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లుగా కోర్టు దృష్టికి వచ్చింది. దీంతో జస్టిస్ ఆర్ఐ ఐ చాగ్లా మరోసారి కేసును విచారించారు. ఆగస్టులో జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించి.. పతంజలి ఉత్పత్తులను సరఫరా చేసినట్లు కోర్టు గుర్తించింది. ఈ మేరకు కోర్టు జరిమానా విధించింది. ఉత్తర్వులు జారీ చేసిన వారం రోజుల్లోగా రూ.50లక్షలు డిపాజిట్ చేయాలని పతంజలిని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల తర్వాత పతంజలి అఫిడవిట్ ఇచ్చిందని, అందులో బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరగా.. కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని చెప్పినట్లు తెలుస్తున్నది. ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత జూన్ 2024 వరకు డిస్ట్రిబ్యూటర్లకు రూ.49,57,861 విలువైన కర్పూరం ఉత్పత్తిని సరఫరా చేసినట్లు అఫిడవిట్‌లో పతంజలి అంగీకరించింది. ఇంకా రూ.25,94,505 విలువైన ఉత్పత్తులు డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఉన్నాయని, విక్రయాలను నిలిపివేసినట్లు పేర్కొంది. ఈ ఏడాది జూన్ తర్వాత సైతం పతంజలి ఉత్పత్తులను విక్రయించినట్లు మంగళం ఆర్గానిక్స్ పేర్కొంది. జూలై 8 వరకు వెబ్‌సైట్‌లో కర్పూరం ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని కోర్టుకు చెప్పింది. మంగళం ఆర్గానిక్స్ ఇచ్చిన ఈ సమాచారం పతంజలి అఫిడవిట్‌లో లేకపోవడంతో.. 50 లక్షలు డిపాజిట్ చేయాలని పతంజలిని ఆదేశించడంతో పాటు అఫిడవిట్ దాఖలు చేయాలని మంగళవం ఆర్గానిక్స్‌కు సూచించింది. ఈ కేసు విచారణ మళ్లీ ఈ నెల 19న జరుగనున్నది. ఇదిలా ఉండగా.. మరో వైపు పతంజలి గ్రూప్ 14 రకాల ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేసినట్లు పేర్కొంది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్న కంపెనీ ఉత్పత్తుల ప్రకటనలపై కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నది.

# వచ్చే ఏడాది ప్రారంభంలో జియో ఐపీఓ..?!




రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ టెలికం సంస్థ 'రిలయన్స్ జియో' త్వరలో స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ కానున్నది. స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ కోసం త్వరలో ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వెళ్లనున్నదని తెలుస్తున్నది. ఈ ఐపీఓ ద్వారా రూ.55 వేల కోట్ల నిధులు సమీకరించాలన్నది రిలయన్స్ జియో లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇదే జరిగితే దేశంలోనే అతిపెద్ద ఐపీఓ కానున్నదని భావిస్తున్నారు.. ఇప్పటి వరకూ రూ.21 వేల కోట్ల నిధులు సమీకరించిన భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఐపీఓనే అతి పెద్దదిగా ఉంది. వచ్చేనెలలో రిలయన్స్ వార్షిక వాటాదారుల సమావేశంలో 'జియో ఐపీఓ' గురించి క్లారిటీ వస్తుందని తెలుస్తోంది. అన్నీ సవ్యంగా జరిగితే 2025 ప్రారంభంలో జియో ఐపీఓ వస్తుందని విశ్లేషకులను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల దినపత్రిక ఒక వార్తాకథనం ప్రచురించింది. ప్రముఖ బ్రోకరేజీ సంస్థ 'జెఫరీస్' అంచనా ప్రకారం జియో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11.11 లక్షల కోట్లు (133 బిలియన్ డాలర్లు) ఉంటుంది. ప్రస్తుత రెగ్యులేటరీ నిబంధనల ప్రకారం ఐపీఓ ద్వారా కనీసం ఐదు శాతం వాటాలను విక్రయించడానికి కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.లక్ష కోట్లు ఉండాలి. దీని ప్రకారం ఐపీఓ ద్వారా రిలయన్స్ జియో రూ.55,500 కోట్ల విలువ గల షేర్లు విక్రయించనున్నదని జెఫరీస్ అంచనా వేసింది. జియో ప్లాట్ ఫామ్స్ లో ముకేశ్ అంబానీ సారధ్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 67.03 శాతం వాటా ఉంది. వ్యూహాత్మక ఇన్వెస్టింగ్ సంస్థలుగా మెటా, గూగుల్‌లకు 17.72 శాతం, విస్టా ఈక్విటీ పార్టనర్స్, కేకేఆర్, పీఐఎఫ్, సిల్వర్ లేక్, ఎల్ క్యాటర్టన్, జనరల్ అట్లాంటిక్, టీపీజీతోపాటు గ్లోబల్ పీఈ ఇన్వెస్టర్స్ సంస్థలకు 15.25 శాతం వాటాలు ఉన్నాయి. ఈ ప్రముఖ సంస్థల నుంచి జియో రూ.1.52 లక్షల కోట్ల నిధులు సేకరించింది. ఐపీఓలో గ్లోబల్ పీఈ సంస్థలు తమ వాటాలను విక్రయిస్తారని తెలుస్తోంది. ఇటీవల జియో తన మొబైల్ టారిఫ్‌లు పెంచడం కూడా ఆ సంస్థ ఐపీఓకు వెళ్లనున్నదని తెలుస్తోంది.




# నటుడిగా బాలయ్య అరుదైన రికార్డు, చిత్ర పరిశ్రమ ఘన సన్మానం



నటుడు నందమూరి బాలకృష్ణ ఎప్పుడూ ప్రత్యేకమే. ఇటు సినిమాలో గానీ, అటు రాజకీయాల్లో గానీ తనదైన ప్రత్యేక శైలి చూపిస్తూ వుంటారు. హిందూపూర్ నియోజకవర్గం నుండి మూడో సారి ఎన్నికయి తనకు రాజకీయాల్లో తిరుగులేదని మరోసారి నిరూపించుకున్నారు. ఒక పక్క హిందూపూర్ అభివృద్ధి పనులు చూసుకుంటూనే, ఇంకో పక్క సినిమాలకి కూడా తగిన సమయం కేటాయిస్తున్నారు. ఇలా బాలకృష్ణ నిరంతరం పని చేస్తూనే అటు పార్టీ సభ్యులకి, ఇటు తన అభిమానులకి ఆదర్శంగా వున్నారు. ఈ ఆగస్టు 30 వస్తే బాలకృష్ణ 50 సంవత్సరాలు నటుడిగా పూర్తి చేసుకుంటున్నారు. బాలకృష్ణ నటించిన మొదటి సినిమా 'తాతమ్మ కల' 1974, ఆగస్టు 30న విడుదలైంది. తన తండ్రి దివంగత లెజండరీ నటుడు నందమూరి తారక రామారావు ఈ సినిమాకి దర్శకత్వం వహించడమే కాకుండా, ఇందులో ప్రధాన పాత్రలో కనపడతారు. ఇదే సినిమాలో నందమూరి హరికృష్ణ కూడా నటించారు. ఈ సినిమా విడుదలై ఆగస్టు 30కి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. అదే సమయంలో బాలకృష్ణ కూడా నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటారు. భానుమతి రామకృష్ణ ఈ సినిమాలో ముఖ్యపాత్రలో నటించారు. అయితే బాలయ్య ఆ సినిమా నుండి ఇప్పటివరకు ఒక అరుదైన రికార్డు సాధించారు అనే చెప్పాలి. "బాలకృష్ణ కథానాయకుడిగా అరంగేట్రం చేసినప్పటినుంచి ఈ 50 సంవత్సరాలు కథానాయకుడిగానే సినిమాలు చేశారు. ఇది వేరే నటుడు ఎవరికీ సాధ్యం కాలేదు, ఒక్క బాలకృష్ణకు మాత్రమే ఇది సాధ్యం అయింది, ఇది అరుదైన రికార్డు," అని చెప్పారు, ప్రముఖ నిర్మాత టి ప్రసన్న కుమార్. అదీ కాకుండా బాలకృష్ణ తన మొదటి సినిమా నుండీ ఇప్పటివరకు ఎక్కడా విరామం లేకుండా నటిస్తూనే వున్నారని, అది కూడా ఇంకొక రికార్డు అని చెప్పారు. చాలామంది నటులు కొంతకాలం విరామం తీసుకోవటం, లేదా క్యారెక్టర్ నటుడిగా, నెగటివ్ క్యారెక్టర్ లో కనపడటం, తరువాత కథానాయకుడిగా స్థిరపడటం ఇలా జరుగుతూ ఉంటుంది. కానీ బాలకృష్ణ మాత్రం, కథానాయకుడిగానే ఈ 50 ఏళ్ళు నటించారు, ఇంకా నటిస్తున్నారు కూడా. ఇది ఒక అరుదైన రికార్డుగా చెప్పొచ్చు. ఇప్పుడు బాలకృష్ణ 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెలుగు చలన చిత్ర పరిశ్రమ బాలకృష్ణకి ఘన సన్మానం చేసి సత్కరించాలని నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిసింది. బాలకృష్ణని పరిశ్రమకి చెందిన కొంతమంది పెద్దలు వెళ్లి కలిసి ఈ విషయం చెప్పినట్టుగా, బాలకృష్ణ అందుకు వొప్పుకున్నట్టుగా తెలుస్తోంది. ఇలాంటి అరుదైన ఘనత సాధించిన బాలకృష్ణని సన్మానించుకోవటం పరిశ్రమ తరుపున ఒక మంచి అవకాశం అని కూడా అంటున్నారు. సెప్టెంబర్ 1 వ తేదీన ఈ సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలుస్తోంది. ఈ సన్మాన కార్యక్రమానికి చిత్ర పరిశ్రమ నుండి ఎంతోమంది, అలాగే అభిమానులు కూడా పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండటంతో, ఈ వేడుక జరగబోయే ప్రదేశం కూడా పెద్దగా ఉండేట్టు తీసుకోవాలని కార్య నిర్వాహకులు అనుకుంటున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ, బాబీ కొల్లి (కెఎస్ రవీంద్ర) దర్శకత్వంలో చేస్తున్న సినిమా చిత్రీకరణ దశలో వుంది. ఈ సినిమా తరువాత బాలకృష్ణ చాలా సినిమాలు చేయాల్సి వుంది. అందులో బోయపాటి శ్రీనుతో చెయ్యబోయే 'అఖండ 2' ఒకటి. వాళ్ళిద్దరి కలయికలో ఇంతకు ముందు వచ్చిన 'అఖండ' సినిమాకి సీక్వల్ గా వస్తోంది ఇది.

# ఎఫ్.డి.సి. ఛైర్మన్ పోటీలో నట్టి కుమార్ కూడా



ప్రముఖ నిర్మాతలు కె ఎస్ రామారావు, ఘట్టమనేని ఆదిశేషగిరి రావులతో పాటు ఇప్పుడు ఇంకొక నిర్మాత నట్టి కుమార్ పేరు కూడా ఎఫ్.డి.సి. ఛైర్మన్ పోటీలో వున్నారని తెలుస్తోంది. పరిశ్రమలో తెలుగు దేశం పార్టీ తరపున గట్టిగా తన గళం వినిపించిన వారిలో నట్టి కుమార్ ముందున్నారు. అందుకని నట్టి కుమార్ కూడా పోటీలో వున్నారని తెలుస్తోంది, ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ఆంధ్ర ప్రదేశ్ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కోసం పైరవీలు ఇప్పుడు జోరందుకున్నాయి. ఒక పక్క ప్రముఖ నిర్మాత కె ఎస్ రామారావు తనవంతు ప్రయత్నాలు తాను చేసుకుంటూ వెళుతున్నారు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిశారు. అంతకు ముందు కొన్ని రోజుల క్రితం మెగా బ్రదర్ నాగబాబుని కూడా కలిశారు. ఇవన్నీ మర్యాద పూర్వకంగా అని చెపుతున్నా, ఆ కలియక వెనకాల తన కోరికని కూడా వాళ్ళ ముందు వెళ్లబుచ్చారు అని కూడా తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవిని కూడా రామారావు కలిసినట్టుగా సమాచారాం. ఇదిలా ఉంటే ఘట్టమనేని ఆదిశేషగిరి రావుకి ఈసారి తెలుగు దేశం కోసం పనిచేశారు, అతనికి ఏదైనా పదవి ఇచ్చి గౌరవించాలని అనుకుంటున్నారు. అందుకోసమని అతన్ని ఎఫ్.డి.సి. ఛైర్మన్ గా నియమించవచ్చు అనే వార్తలు కూడా పరిశ్రమలో వస్తున్నాయి. అయితే ఆదిశేషగిరి రావు ఎప్పుడూ ప్రయత్నాలు చెయ్యరు, తనకి పదవి ఇస్తాను అంటే వద్దనకుండా చేస్తారు. దానికితోడు అతను వివాదం లేని వ్యక్తి కూడా అవటంతో అతనికి కూడా ఛాన్స్ వుంది అంటున్నారు. ఈ ఇద్దరూ కాకుండా ఇప్పుడు అనూహ్యంగా మూడో వ్యక్తి పేరు వినిపిస్తోంది. అతను మరెవరో కాదు, ప్రముఖ నిర్మాత నట్టి కుమార్. ఈమధ్య కాలంలో తెలుగు దేశం పార్టీ తరపున తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తన గళం గట్టిగా వినిపించిన వ్యక్తి ఎవరైనా వున్నారు అంటే అది నట్టి కుమార్ అని చెప్పొచ్చు. వైస్సార్సీపీ పార్టీని ఎండగడుతూ, తెలుగు దేశం పార్టీకి సపోర్ట్ గా ఎన్నో ప్రెస్ మీట్ లు పెట్టడమే కాకుండా, రామ్ గోపాల్ వర్మ లాంటి దర్శకులు చంద్రబాబు, నారా లోకేష్ లపై వ్యంగ్యంగా తీసిన సినిమాలను న్యాయపరంగా అడ్డుకున్నారు కూడా. అందుకని ఇప్పుడు నట్టి కుమార్ కూడా ఈ ఛైర్మన్ పదవి కోసం తన ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలిసింది. నట్టి కుమార్ కి నేరుగా నారా లోకేష్ తో మాట్లాడుతూ ఉంటారని, అతనికి లోకేష్ ఆశీస్సులు ఉన్నాయని, అందుకని అది తనకి కచ్చితంగా వస్తుందని నట్టి కుమార్ చాలా ధీమాగా వున్నారని ఒక వార్త. అయితే తెలుగు దేశం పార్టీ, మిత్ర పక్షమైన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తో కలిపి ఈ ఛైర్మన్ పదవి ఎవరికిస్తే బాగుంటుంది అనే విషయంపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

# క్రేజ్ ను క్యాష్ చేసుకోలేకపోతున్న పాన్ ఇండియా స్టార్!



సౌత్ హీరోలంతా ఇప్పుడు 'పాన్ ఇండియా స్టార్స్'గా మారడానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే కొందరు కథానాయకులు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే పాన్ ఇండియా స్టార్ డమ్ సాధించడం ఒక ఎత్తయితే.. దాన్ని నిలబెట్టుకోవడం మరో ఎత్తు. నిజానికి ఏ హీరోకైనా క్రేజ్ ను కాపాడుకుంటూ ముందుకు వెళ్ళడమే అతి పెద్ద ఛాలెంజ్. అయితే ఆ విషయంలో కన్నడ హీరో యష్ వెనుకబడిపోయారనే అనుకోవాలి. 'కేజీఎఫ్' సినిమాతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకొని దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు రాకింగ్ స్టార్ యష్. చిత్రం భారీ వసూళ్లను రాబట్టి ఇండియన్ బాక్సాఫీస్ ను షేక్ చేసింది. ఇది కన్నడలోనే కాదు, బాలీవుడ్ టాలీవుడ్ కోలీవుడ్ లలో కూడా ఎన్నో రికార్డులు క్రియేట్ చేసింది. దీంతో శాండిల్ వుడ్ హీరో కాస్తా పాన్ ఇండియా స్టార్ గా అవతరించాడు. కానీ సరైన ప్లానింగ్ లేక యశ్ ఆ స్టార్ డమ్ ను క్యాష్ చేసుకోలేకపోయారు. 2022 సమ్మర్ లో చాప్టర్ 2' సినిమా థియేటర్లలో రిలీజైంది. తర్వాతి చిత్రాన్ని ప్రకటించడానికి దాదాపు ఏడాదిన్నర సమయం తీసుకున్నారు యష్. అది కూడా ఎవరైనా పాపులర్ పాన్ ఇండియా డైరెక్టర్ తో ప్రాజెక్ట్ సెట్ చేసుకుంటారని అభిమానులు భావించారు. కానీ ఒక షార్ట్ ఫిల్మ్, రెండు సినిమాల అనుభవం ఉన్న గీతూ మోహన్ దాస్ డైరెక్షన్ లో 'టాక్సిక్' మూవీని అనౌన్స్ చేసి అందరినీ ఆశ్చర్య పరిచారు. 'టాక్సిక్' చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తామని అనౌన్స్ మెంట్ రోజునే అధికారికంగా ప్రకటించారు. కానీ అప్పటి నుంచి ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి ప్రచారం జరగడం లేదు. సోషల్ మీడియాలో హీరో అభిమానులు ఈ ప్రాజెక్ట్ గురించి తెలుసుకోడానికి ఆసక్తిగా ఉన్నారు. కానీ దీని గురించి ఒక్కటంటే ఒక్క అప్డేట్ కూడా మేకర్స్ సైడ్ నుంచి రావడం లేదు. హీరోయిన్ తో సహా సినిమాలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలేవీ తెలియడం లేదు. అలానే బాలీవుడ్ 'రామాయణం' మూవీలో యశ్ భాగం అవుతున్నారు. రాముడిగా రణబీర్ కపూర్, సీతా దేవిగా సాయి పల్లవి నటిస్తుంటే.. రావణాసురుడి పాత్రలో యష్ కనిపించబోతున్నారు. ఈ మధ్యనే సెట్స్ మీదకు వెళ్ళిన ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అప్డేట్ కూడా బయటకు రావడం లేదు. ఇలా కన్నడ రాకింగ్ స్టార్ నటిస్తున్న రెండు చిత్రాలూ సైలెంట్ మోడ్ లో ఉండటంతో, గత కొన్నాళ్లుగా మీడియాలో సోషల్ మీడియాలో ఎక్కడా యశ్ గురించిన చర్చలు జరగడం లేదు. దీంతో ఫ్యాన్స్ బాగా డిజప్పాయింట్ అవుతున్నారు. అదే సమయంలో ప్రభాస్, అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి పాన్ ఇండియా హీరోలు.. తమ స్టార్ డమ్ ను నిలబెట్టుకునే విధంగా భారీ ప్రాజెక్ట్స్ సెట్ చేసుకుంటున్నారు. ఇద్దరు ముగ్గురు అగ్ర దర్శకులను లైన్ లో పెట్టుకుంటున్నారు. ప్రభాస్ అయితే రెండేళ్ల గ్యాప్ లో నాలుగు పాన్ ఇండియా చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ఆల్రెడీ మరో నాలుగు చిత్రాలకు కమిట్ అయ్యారు. కానీ యష్ మాత్రం మరీ స్లోగా వెళ్తున్నారు. మిగతా హీరోల మాదిరిగా యాక్టీవ్ గా ఉండటం లేదు. ఇదిలాగే కొనసాగితే రాబోయే చిత్రాల్లో హీరోని ఇతర భాషా ప్రేక్షకులు గుర్తించలేని పరిస్థితి రావొచ్చు. అది పరోక్షంగా ఆయన మార్కెట్ మీద కూడా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి ఇప్పటి నుంచైనా యశ్ తన పాన్ ఇండియా స్టార్ డమ్ ను క్యాష్ చేసుకునే విధంగా భారీ ప్లానింగ్ తో రావాలని అభిమానులు భావిస్తున్నారు. సినిమా సినిమాకి ఎక్కువ టైమ్ తీసుకోకుండా.. క్రేజ్ ఉన్నప్పుడే వీలైనంత త్వరగా మూవీస్ చెయ్యాలని కోరుకుంటున్నారు.

# వాటితోనే సరిపెడుతున్న సుందరాంగి..!



మోడల్ గా తన బ్యూటీ నెస్ తో సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చింది శ్రీనిధి శెట్టి. తొలి సినిమా లాంటి బ్లాక్ బస్టర్ హిట్ సినిమాలో నటించింది. ఆ సినిమా రెండు భాగాలతో పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి ఆ సినిమా తర్వాత చియాన్ విక్రం తో కోబ్రా సినిమాలో నటించింది. ఐతే ఆ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో అమ్మడికి పెద్దగా ఛాన్సులు రాలేదు. ఐతే సినీ కెరీర్ ఎలా ఉన్నా ఫోటో షూట్స్ తో మాత్రం శ్రీనిధి అదరగొట్టేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు బ్లాక్ కలర్ షర్ట్ తో లూజ్ హెయిర్ తో తన క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంటుంది. క్రేజ్ సంపాదించాలంటే సినిమాలే చేయనవసరం లేదు ఇలా ఫోటో షూట్స్ కూడా చేయొచ్చు అని శ్రీనిధి చెబుతుంది. ప్రస్తుతం అమ్మడికి 5 మిలియన్ కి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. వారందరికీ తన ఫోటో షూట్స్ తో మంచి ట్రీట్ ఇస్తుంది అమ్మడు. తెలుగు నుంచి ఆఫర్లు వచ్చినా అప్పుడు చేయనని చెప్పిన శ్రీనిధి ప్రస్తుతం తెలుగులోనే సినిమా ఆఫర్ అందుకుంది. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా వస్తున్న తెలుసు కదా సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది శ్రీనిధి శెట్టి. ఐతే ఈ సినిమాలో శ్రీనిధితో పాటు రాశి ఖన్నా కూడా నటిస్తుంది. ఇక లేటెస్ట్ గా అమ్మడు న్యాచురల్ స్టార్ నాని చేస్తున్న హిట్ 3 లో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. శైలేష్ కొలను డైరెక్షన్ లో హిట్ ఫస్ట్ కేస్, హిట్ సెకండ్ కేస్ సినిమాలు విశ్వక్ సేన్, అడవి శేష్ లు చేశారు. ఇప్పుడు హిట్ 3 ని నాని చేస్తున్నాడు. ఈ సినిమాలకు నాని నిర్మాత అని తెలిసిందే. హిట్ 3 లో శ్రీనిధి హీరోయిన్ గా లక్కీ ఛాన్స్ అందుకుందని టాక్. కథలు నచ్చక చేయట్లేదా లేదా తను అడిగినంత రెమ్యునరేషన్ ఇవ్వట్లేదని ఆఫర్లు రావట్లేదా కానీ శ్రీనిధి సినీ కెరీర్ మాత్రం చాలా వెనుకపడింది. ఎంత గ్లామర్ షో చేసినా సినిమాల్లో పాత్రలతో ప్రేక్షకులను అలరించాల్సిందే. ఐతే వచ్చిన ప్రతి అవకాశం చేయాల్సిన పనిలేదు కానీ కెరీర్ గ్రాఫ్ పెంచుకునే క్రమంలో కచ్చితంగా కొన్ని కథలను ఓకే చేయాల్సి ఉంటుంది. మరి శ్రీనిధి ఇక మీదట తన సినిమాల వేగం పెంచి వరుస ప్రాజెక్ట్ లు చేస్తే సినిమాల క్రేజ్ కూడా తోడై సోషల్ మీడియాలో మరింత పాపులారిటీ తెచ్చుకునే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు. లుక్స్ పరంగా చూస్తే ఒక స్టార్ హీరోయిన్ కు ఉండాల్సిన క్వాలిటీస్ అన్ని ఉన్నాయి. ఐనా కూడా శ్రీనిధి ఎందుకు ఛాన్సులు అందుకోలేకపోతుందని ఆమె ఫాలోవర్స్ ఫీల్ అవుతున్నారు. స్టోరీ సెలక్షన్ లో శ్రీనిధి ఆలోచన మారి వరుస సినిమాలు చేయాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు.

# క్యారెక్టర్ ఆర్టిస్ట్ నుంచి.. హీరోయిన్‌గా దూసుకెళుతున్న 'ఇనియా'



తమిళ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు ఇనయా. సీరియల్ నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకెళుతుంది. తమిళ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలను పోషించిన నటి ఇనియాకు ఇపుడు హీరోయిన్‌గా అవకాశాలు వస్తున్నాయి. ఆమె తాజాగా హీరోయిన్‌గా నటించిన 'సీరన్' చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమైంది. జేమ్స్ కార్తీక్ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చి, సొంతంగా నిర్మించారు. దురై కె.మురుగన్ దర్శకత్వం వహించారు. సోనియా అగర్వాల్ కీలక పాత్ర పోషించారు. సమాజంలోని హెచ్చుతగ్గులు, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులను ప్రధానంగా ప్రస్తావిస్తూ సాగే ఒక మంచి కమర్షియల్ చిత్రంగా రూపొందించారు. అలాగే మరో రెండు మూడు చిత్రాల్లో ఆమె హీరోయిన్‌గా నటించేందుకు సంప్రదింపులు జరుపుతున్నాయి. కాగా, 'వాగైసూడవ' చిత్రం ద్వారా వెలుగులోకి వచ్చిన ఇనియా.. ఆ తర్వాత 'మౌనగురు', 'అమ్మావిన్ కైపేసి', 'కణ్ పేసుం వార్తైగల్', 'మాసాని', 'నాన్ సిగప్పు మణిదన్', 'నాన్ కడవుల్ ఇల్లై' 'పొట్టు' వంటి చిత్రాల్లో నటించారు. గత కొంతకాలంగా హీరోయిన్‌గా ఇనియాకు సరైన అవకాశాలు లేవు. గత మూడేళ్ళకాలంలో ఆమె కేవలం ఒకే ఒక చిత్రంలో నటించారు. కానీ, ఇపుడు ఆమెకు వరుస సినీ అవకాశాలు వస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# బేబమ్మ తక్షణ కర్తవ్యం ఏంటి..?



తొలి సినిమాతోనే సూపర్ క్రేజ్ తెచ్చుకుని ఆ తర్వాత ప్రేక్షకులను అలరించడంలో విఫలమైన హీరోయిన్ గా కృతి శెట్టి తన బ్యాడ్ లక్ కొనసాగిస్తుంది. ఉప్పెనతో తెలుగు తెర మీద కొత్త అందంగా అదరగొట్టిన అమ్మడు ఆ సినిమాలో బేబమ్మ పాత్ర ఆమె కోసమే అన్నట్టుగా చేసింది. ఐతే ఆ తర్వాత సినిమాల్లో అమ్మడు ఎందుకో అంత ప్రభావం చూపించలేకపోయింది. తెలుగులో చేయడానికి ఎనిమిది సినిమాలు చేసినా ఉప్పెన తర్వాత అమ్మడికి పేరు తెచ్చిన సినిమా ఒక్కటి కూడా లేదు. ఈమధ్యనే శర్వానంద్ తో మనమే అంటూ మరోసారి ప్రేక్షకులను పలకరించిన కృతి శెట్టి ఆ సినిమాతో జస్ట్ ఓకే అనిపించింది. ప్రస్తుతం మలయాళంలో ఒక సినిమా తమిళంలో రెండు సినిమాలు చేస్తుంది కృతి శెట్టి. ఐతే తెలుగులో అమ్మడు ఛాన్సుల కోసం ఎదురుచూస్తున్నా బేబమ్మని మాత్రం ఎవరు లెక్క చేయట్లేదని తెలుస్తుంది. తన క్యూట్ యాక్టింగ్ తో కెరీర్ మొదట్లోనే కుర్రాళ్లను వల్లో వేసుకున్న కృతి ఇప్పుడు అసలు అవకాశాలు లేని విధంగా పరిస్థితి తయారు చేసుకుంది. ఐతే తెలుగులో ఎలాగు వర్క్ అవుట్ అయ్యేలా లేదని చిన్నగా కోలీవుడ్ జంప్ అయ్యింది చిన్నది. అక్కడ ఆల్రెడీ రెండు సినిమాలు సెట్స్ మీద ఉండగా మరో సినిమా చర్చల్లో ఉందట. మలయాళంలో కూడా అక్కడ క్రేజీ హీరో టోవినో థామస్ నటిస్తున్న సినిమాలో ఛాన్స్ పట్టేసింది కృతి శెట్టి. సో చేస్తున్న సినిమాల్లో ఏ ఒక్కటి క్లిక్ అయినా అక్కడ కృతి సూపర్ క్రేజ్ తెచ్చుకుంటుందని చెప్పొచ్చు. ఐతే ఉప్పెన డైరెక్టర్ బుచ్చి బాబు తన సెకండ్ సినిమా చరణ్ తో చేస్తున్నాడు. ఉప్పెన సెంటిమెంట్ ని రిపీట్ చేస్తూ చరణ్ సినిమాలో కృతికి ఛాన్స్ ఇస్తే మాత్రం అమ్మడికి మళ్లీ టాలీవుడ్ లో హోప్ మొదలైనట్టే లెక్క. ఐతే ఆల్రెడీ చరణ్ బుచ్చి బాబు సినిమాలో జాన్వి కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. మరి కృతి శెట్టికి ఛాన్స్ ఉంటుందా లేదా అన్నది చూడాలి. ఏది ఏమైనా తెలుగులో మరో మంచి అవకాశం కోసం కృతి ఈగర్ గా వెయిట్ చేస్తుంది. సినిమా ఛాన్సుల కోసమే ఈమధ్య అమ్మడు ఫోటో షూట్స్ లో కూడా గ్లామర్ డోస్ పెంచుతుంది. ఉప్పెన సినిమాలో బేబమ్మ కూడా బోల్డ్ గా కనిపించేందుకు రెడీ అని హింట్ ఇస్తుంది.

# రైల్ అండర్ బ్రిడ్జిలు, రైల్ ఓవర్ బ్రిడ్జిలు పరిశీలించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్



హైదరాబాద్ జూలై 11 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : సికింద్రాబాద్ డివిజన్ లోని పలు రైల్వే స్టేషన్లు, రైల్ అండర్ బ్రిడ్జిలు, రైల్ ఓవర్ బ్రిడ్జిలు పరిశీలించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, పాల్గొన్న అధికారులు సుబ్రహ్మణ్యం, సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్, రామారావు సీనియర్ డివిజన్ కోఆర్డినేషన్, శ్రీనివాస్ బిజెపి నేతలు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, రాజిరెడ్డి, భరత సింహారెడ్డి మాణిక్ రెడ్డి, శివాజీ, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మల్కాజ్గిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వినాయక నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, నియోజకవర్గ కన్వీనర్ %ఎఆ% వెంకటేష్, సీనియర్ నేతలు మహేష్, బాలలింగం, భానుప్రకాష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 4 :
కాలనీ వద్ద ఉన్న రైల్వేగేట్ ను పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్.
ఇక్కడ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలి.
నిర్మాణం చేపట్టాలి అని వినతి పత్రం అందించిన స్థానికులు.
అల్వాల్ లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 5:
వెంకటాపూర్ వద్ద రైల్ అండర్ బ్రిడ్జి నీ పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్.
ఉన్నా కూడా నిరుపయోగంగా ఉంది.
దీనిని ఉపయోగంలోకి తీసుకురావడానికి నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.
సుచిత్ర సర్కిల్ లో:
బ్రిడ్జి వెడల్పు పనులను చేపట్టాలని, హైవే కి ఇరువైపులా రైల్వే పట్టాలపై సర్వీస్ రోడ్డు నిర్మించాలని, చౌరస్తా కాబట్టి ప్రయాణీకులకు అనుకూలంగా ఉండేలా రైల్వే స్టేషన్ నిర్మాణం చేయాలని స్థానికులు కోరారు. అవకాశాలను పరిశీలించాలని అధికారులను కోరిన ఈటల రాజేందర్.
లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 8 :
నేరెడ్మెట్ – మౌలాలి రోడ్ లోని అమ్ముగూడ లెవల్ క్రాసింగ్ వద్ద రైల్ అండర్ బ్రిడ్జి నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఏళ్ళ తరబడి పనులు ఆగిపోయాయి.
రాష్ట్రం నిధులు ఇవ్వలేమని ఈమధ్యనే తేల్చి చెప్పడంతో పూర్తిగా రైల్వే నిధులతో నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించిన ఈటల రాజేందర్.
లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 9 :
ఓల్డ్ నేరెడ్మెట్ పోలీస్ స్టేషన్ గేట్
ఇళ్ల స్థలాలు పోతున్నాయని స్థానికులు అడ్డుకోవడంతో ఆగిన పనులు.
ఒప్పించాలని స్థానిక కార్పొరేటర్, నేతలను కోరిన ఈటల.
బ్రిడ్జి నిర్మాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపిన ఈటల.
లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 10:
వినాయక్ నగర్.
కొత్త మంజూరు చేయాలని కోరారు.
సఫిల్ గూడ రైల్వే స్టేషన్ :
స్టేషన్ పక్కనుండి కొత్త రోడ్డు నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేసిన స్థానికులు.
7 వేల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఈటల దృష్టికి తీసుకువచ్చారు

# మాజీ ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి ఏ గాంధీ భవన్



హైదరాబాద్ చేవెళ్ల జూలై 11 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : గాంధీ భవన్ లో గురువారం కురియన్ కమిటీతో భేటీ అయిన చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ జి రంజిత్ రెడ్డి. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో... పార్టీ సీటు కోల్పోవడం పై కమిటీతో సుదీర్ఘ చర్చలు. ఎందుకు సీటు రాలేదన్న అంశంపై కురియన్ కమిటీకి వివరించిన రంజిత్ రెడ్డి.చేవెళ్లలో కాంగ్రెస్ ఓటమికి బీజేపీ వేవ్ ఒక కారణం కాగా... బీఆర్ఎస్ ఓటు బీజేపీకి ట్రాన్స్ఫర్ అయిందని ఎన్నికల గణాకాలు స్పష్టంగా చెబుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చాలా మంది నాయకులు, లీడర్లు, క్యాడర్ తన కోసం పనిచేశారని... వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక తనకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానంకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రాంతంలోని పట్టణ ప్రాంతాల్లో బీజేపీ వేవ్ వచ్చిందని అభిప్రాయ పడ్డారు. బీఆర్ఎస్ కనీసం పది శాతం ఓట్లు కూడా ఎందుకు తెచ్చుకోలేదు అన్నది ఆ పార్టీ నాయకులనే అడగాలని మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకి సమాధానంగా చెప్పారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో తాము కూడా గట్టి పోటీ ఇచ్చామని స్పష్టం చేశారు. పార్టీ కోసం రానున్న ఎన్నికల్లో ఏం చేయాలి అన్న దానిపై కసరత్తు చేస్తున్నామని వివరించారు.

# రోడ్ భద్రత - ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలి



వేములవాడ జూలై 11 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : వేములవాడ రూరల్ పరిధిలోని వట్టెముల గ్రామంలో ప్రజలకు మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ డ్రైవింగ్, రాంగ్ రూట్, ర్యాష్ డ్రైవింగ్ ,మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనార్ధల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ గారు మాట్లాడుతూ ప్రజలు రోడ్ భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని, వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సిట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని, ప్రాణం ఎంతో విలువైనది అని మన మీద మన కుటుంబ సభ్యులు ఆధారపడి ఉంటారని మద్యం సేవించి, నిర్లక్ష్యంగా ,ర్యాష్ డ్రైవింగ్,రాంగ్ రూట్ లో ,అవగాహన రహిత్యంలో వాహనాలు నడుపుతు ప్రాణాల మీద తెచుకోవద్దని అన్నారు.ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,మైనర్ డ్రైవింగ్ చేయడం నేరం అని మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదు అని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు. ఏఎస్పీ గారి వెంట రూరల్ ఎస్.ఐ మారుతి, సిబ్బంది ఉన్నారు.

# నిధుల కోసం భూములు తాకట్టా... అలా చేస్తే పరిశ్రమలు ఎలా వస్తాయి.?

హైదరాబాద్ : రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ సరార్, ఇప్పుడు నిధుల సమీకరణ కోసం ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ.20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్లు, దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రూ.100 కోట్ల కమిషన్ ఇచ్చేందుకు సిద్ధమైనట్టు మీడియాలో వస్తున్న కథనాలను కోట్ చేస్తూ ఆయన బుధవారం ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు రాక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, అలాంటిచోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని విమర్శించారు. రాష్ట్రంలో ఏడు నెలలుగా పారిశ్రామికరంగం స్తబ్దుగా మారిందని, కొత్తగా పెట్టుబడులు రావడం లేదని, ఉన్న కంపెనీలు కూడా ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయని పేర్కొన్నారు. పరిశ్రమలకు ఇవ్వాల్సిన భూములను రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెడితే కంపెనీలు ఎలా వస్తాయని, కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయని ప్రశ్నించారు. పురుగుల అన్నం. నీళ్ల చారు. బల్లిపడిన టిఫిన్లు. చిట్టెలుకలు తిరిగే చట్నీలు’ అని రాష్ట్రంలో హాస్టళ్ల దుస్థితిపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లు దయనీయంగా మారాయని ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు.

# తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురి చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు



వృద్ధాప్యంలో భరోసాగా ఉండాల్సిన సంతానం తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురి చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ యాక్ట్ ఉపయోగపడుతుంది. ఈరోజు కమిషనర్ డిజేబుల్ వెల్ఫేర్ , వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్ అండ్ ట్రాన్స్ జెండర్ పర్సన్స్ శ్రీమతి శైలజ వేములవాడ జులై 11 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని తెలియజేశారు. క్రిమినల్ కేసులను ఆన్లైన్ ద్వారా నమోదు చేయడం ద్వారా ఎన్నో ఇబ్బందులను తప్పించినట్లు అయింది అని తెలియజేశారు. ఎవరైనా ఈ టోల్ ఫ్రీ నెంబర్ 14567 కు కాల్ చేసి చెప్పినట్లయితే వారికి నిర్లక్ష్యం చేసిన వారి సంతానంపై వారసులపై బాధ్యులపై ప్రభుత్వ సిబ్బంది స్వయంగా కేసు నమోదు చేయిస్తారని తెలియజేశారు. అలాగే ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ 14567 కి ఫోన్ చేసినట్లయితే మీ ఇంటి వద్దకే వచ్చి మీకు జరిగినటువంటి అన్యాయం గురించి %=ఙూ% కోర్టులో ట్రిబ్యునల్, కలెక్టరు కోర్టులో అప్పిలేట్ ట్రిబ్యునల్ లో కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే అట్టి వయో వృద్ధుల ఆస్తిని వారసులు అనుభవిస్తూ వారినీ నిర్లక్ష్యం చేసినట్లయితే అట్టి ఆస్తిని తిరిగి స్వాధీన పరచుకొని తిరిగి వయో వృద్ధులకు అందించడం జరుగుతుందని తెలియజేశారు. కాబట్టి జిల్లాలోని వయోవృద్ధులు అందరు కూడా ఇట్టి టోల్ ఫ్రీ నెంబర్ 14567 ని వినియోగించుకోవాలని 24 గంటలు ఇది అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. కాబట్టి ఫోన్ చేసి వారి యొక్క సమస్యలను చెప్పుకోవాలని తెలియజేశారు. అలాగే వారికి కౌన్సెలింగ్ న్యాయసహాయం వైద్య సహాయం కూడా అందించడం జరుగుతుందని తెలియజేశారు. కాబట్టి అందరూ 14567 నంబర్ ని వినియోగించుకోగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ ,చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాపాలన సేవా కేంద్రం పరిశీలించిన కలెక్టర్



సిరిసిల్ల /ముస్తాబాద్, జూలై 11 : ముస్తాబాద్ లోని ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ముస్తాబాద్ లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆన్లైన్ లో వివరాలు నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీఓ రాజేందర్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి..... జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి, జూలై- 11 : సింగరేణి, ఎన్టిపిసి క్రింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సింగరేణి ఆర్జి1, ఆర్జి 2, ఆర్జి 3, ఎన్టిపిసి పరిధిలో పెండింగ్ భూ సేకరణపై అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఎన్టిపిసి ఎస్.టి.పి.పి. స్టేజ్ 2 యాష్ డైక్ నిర్మాణం కోసం అంతర్గాం మండలం మొగల్ పహడ్ గ్రామం వద్ద అవసరమైన 606 ఎకరాల భూ సేకరణ కోసం ప్రిలిమినరీ ఎంజాయ్ మెంట్ సర్వే పూర్తి చేసి , నోటిఫికేషన్ విడుదల చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్.టి.పి.పి. స్టేజ్ 2 పైప్ లైన్ కారిడార్ ఏర్పాటు కోసం రామగుండం మండలం మల్యాలపల్లి గ్రామం, అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామంలో 45 ఎకరాల భూ సేకరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఇప్పటివరకు ఎన్టిపిసి సంస్థ సేకరించిన 9543 ఎకరాల 10 గుంటల భూముల మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి చేసి ధరణి పోర్టల్ లో రికార్డులను అప్ డేట్ చేయాలని అన్నారు. సింగరేణి ఆర్జి 1,ఆర్జి 2, ఆర్జి 3 పరిధిలోని పెండింగ్ భూ సేకరణకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సర్వేయర్లను ఆదేశించారు. ఆర్జి 1 పరిధిలో ముంపు గ్రామమైన సింగిరెడ్డిపల్లి ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ పూర్తి అవుతున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఆర్జీ 3 పరిధిలో ఉన్న బుధవారంపేట, రత్నాపూర్, అక్కెపల్లి, లద్నాపూర్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ స్థితిగతులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని ఆర్డీఓ హనుమా నాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, సింగరేణి, ఎన్టీపీసీ, రెవెన్యూ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# “తెలంగాణ సాగునీటిరంగ పితామహుడు” : నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జన్మదినం నివాళులు అర్పించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ జూలై 11 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీ.పూ. 2550 సంవత్సరంలో ఈజిప్టులో స్టెప్ పిరమిడ్ కట్టిన ఇంజనీర్ “ఇమ్ హెూటెప్” ను ప్రపంచంలో మొదటి ఇంజనీర్ గా గౌరవిస్తాం. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను భారతదేశపు మొదటి ఇంజనీర్ గా గౌరవించుకుంటాం. ఆయన పుట్టినరోజు సెప్టెంబర్ 15 ను “ఇంజనీర్స్ డే” గా జరుపుకుంటాం. హైదరాబాదు నగరాన్ని వరదల నుండి రక్షించడానికి ఒక వ్యవస్థను రూపొందించినపుడు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారికి గొప్ప పేరు వచ్చింది. ఆ తర్వాత గర్వంగా చెప్పుకోదగ్గ ఇంజనీర్ “నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్”. మనం నిజాంసాగర్ ప్రాజెక్టు గురించి ఇవ్వాల గొప్పగా మాట్లాడుకుంటాం. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి, అస్థిత్వంలో జరిగినట్టే మహానుభావుల గుర్తింపులోనూ అన్యాయం జరిగింది. అందుకు ఉదహారణే మన నవాజ్ జంగ్ గారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ గారి జయంతి రోజున ఇంజనీర్స్ డేగా అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం. అలీ నవాజ్ జంగ్ గారు మొట్టమొదటి స్వదేశీ చీఫ్ ఇంజనీర్ గా రికార్డు సృష్టించారు. అలీ నవాజ్ జంగ్ కు చీఫ్ ఇంజనీర్ పదవిని అప్పజెప్పిన సందర్భంలో ఎ.టి.మెకంజీ.. అనే బ్రిటీషు చీఫ్ ఇంజనీర్. “నేను నా బాధ్యతలను నాకంటే ప్రతిభావంతుడికి, నాకంటే గొప్ప పరిపాలనా దక్షుడికి అప్పజెప్తున్నాను” అంటూ చెప్పారంటే ఆయన ఎంత ప్రతిభావుంతుడో ప్రత్యక్షంగా చెప్పాల్సిన పనిలేదు. అంతటి గొప్ప ఇంజనీర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న “11వ తెలంగాణ ఇంజనీర్స్ డే”కు నన్ను ముఖ్యఅతిథిగా పిలవడం గౌరవంగా భావిస్తున్నా.. మీరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా భవన నిర్మాణానికి ఇంజినీర్లు 2 వేల గజాల భూమి అడిగారు ప్రభుత్వంలో చర్చించి మీకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటాం. ఆయన అంతంతమాత్రం టెక్నాలజీ ఉన్న ఆ రోజుల్లోనే 58 టీఎంసీల సామర్థ్యం కలిగిన నిజాంసాగర్ ప్రాజెక్టు ను నిర్మిస్తే అది ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉంది. కానీ, రెండు మూడేండ్ల కింద్ర కట్టిన సాగునీటి ప్రాజెక్టులు నెర్రెలుబారుతున్న సంఘటనలు ఇవ్వాల మనం పేపర్లలో, టీవీల్లో చూస్తున్నాం.. దీనిపట్ల ఇంజనీర్లు ఆత్మవిమర్శ చేసుకోవల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొ డాక్టర్ డి.ఎన్.రెడ్డి, %చీ×ు% వరంగల్ మాజీ డైరెక్టర్ పి.జీ శాస్త్రి డాక్టర్ జి. వెంకట సుబ్బయ్య, కరీం, ఎస్. జస్వంత్ కుమార్ చంద్రమౌళి, ప్రొ. రమణా నాయక్, ఐ. గణపతి రెడ్డి, డాక్టర్ సీతారామ్ బాబు, దేశపాండే తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



వేములవాడ హైదరాబాద్ జూలై 11 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్ పర్సన్ గా మానాల మోహన్ రెడ్డి గారి పదవి స్వీకార కార్యక్రమంలో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు..

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.